
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 21.4
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 31 ఆగస్టు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.70 (303.9495)	2,50,487	2,50,487
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.60 (4.09)	8815.90	8815.90
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.798 (39.5040)	2,39,000	2,14,059

చికెన్ ధరలు	లైవ్ : రూ.120	డ్రెస్ : రూ.170	స్కిన్‌లెస్ : రూ.200

అసెంబ్లీకి వెళ్లను!

- వరద సహాయక చర్యల్లో పాల్గొంటా
- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కీలక నిర్ణయం
- మంత్రివర్గ విస్తరణ తర్వాత ప్రభుత్వంపై విరుచుకుపడతానన్న ఎమ్మెల్యే
- తరచూ నిలదీస్తూ గళమెత్తుతున్న రాజగోపాల్
- ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారోననే ఆసక్తి

నల్లగొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): అధికార పార్టీలో ప్రతిపక్షనేతలా వ్యవహరిస్తూ రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేకత చాటుతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి ఆసక్తికర నిర్ణయాన్ని వెల్లడించారు. తాజాగా, మొదలైన అసెంబ్లీ సమావేశాల్లో తొలిరోజు మినహా మిగిలిన రోజుల్లో తాను పాల్గొనేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని కుదిపేసిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగుబాటుపై జస్టిస్ పీసీ.ఘోష్ నివేదికపై చర్చ, స్థానిక సంస్థల ఎన్నికల వంటి కీలకమైన ఎజెండాతో జరగనున్న ఈ అసెంబ్లీ సమావేశాలపై అందరి దృష్టి నెలకొంది. ఈ సందర్భంలో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఈ సమావేశాలకు దూరంగా ఉండనున్నట్టు ప్రకటించడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

అసెంబ్లీ సమావేశాలు శనివారం మొదలవుతున్న సందర్భంలో అసెంబ్లీకి ఎదురుగా ఉన్న గన్‌పార్క్‌వద్దకు పెద్ద సంఖ్యలో మద్దతుదారులు, అనుచరులతో కలిసి వచ్చిన రాజగోపాల్‌రెడ్డి అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేయడం కలకలం సృష్టించింది. భారీ వర్షాలతో కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని, వారిని ఆదుకోవడమే తనకు ముఖ్యమని పేర్కొన్నారు. ఆదివారం నుంచి వరద సహాయక చర్యల్లో తన అనుచరులతో కలిసి పాల్గొంటానని స్పష్టం చేశారు. ప్రజలు వరద కష్టాల్లో ఉన్నప్పుడు తాను అసెంబ్లీలో ఉండడం సరి కాదని అభిప్రాయపడ్డారు. మంత్రి పదవిపై స్పందిస్తూ పదవులు ఎవ్వరికీ శాశ్వతం కాదని, మంచి వ్యక్తిత్వం, సేవ చేసే గుణమే శాశ్వతమని పేర్కొన్నారు. పదవులు శాశ్వతంగా కొనసాగవని, మంచితనం, సేవాగుణం శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. ఎమ్మెల్యేగా కాకుండా ఒక వ్యక్తిగా వరద సహాయకచర్యల్లో పాల్గొం...ఎజ్జూజుజ్జుజ్జు నని వివరించారు.



యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో ఓ కార్యక్రమంలో మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మంత్రివర్గ విస్తరణ తరువాత గళమెత్తుతున్న రాజగోపాల్‌రెడ్డి

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏర్పాటైన మంత్రివర్గంలో, ఆతర్వాత జూన్‌లో జరిగిన మంత్రివర్గ విస్తరణలో సైతం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి దక్కలేదు. మంత్రివర్గ విస్తరణ వరకు ఎలాంటి రాజకీయ విమర్శలు, వ్యాఖ్యలు చేయకుండా సైలెంట్‌గా ఉన్న రాజగోపాల్‌రెడ్డి, ఆ తరువాత తన గళాన్ని పెంచారు. పలు సమస్యలపై, రాజకీయ అంశాలపై తనదైన శైలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తుండడం చర్చనీయాంశంగా మారింది. తనకు మంత్రి పదవి రాకపోవడానికి కారణాలను ఒక్కో సందర్భంలో బహిరంగపరుస్తూ రాజకీయాల్లో చర్చకు తెరతీశారు. మాజీమంత్రి జానారెడ్డి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని లేఖరాయడం ద్వారా తన అవకాశాలకు గండి పడిందని భావించిన రాజగోపాల్‌రెడ్డి చౌటుప్పల్‌లో ఏప్రిల్‌లో జరిగిన మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకార సభలో జానారెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆతర్వాత కొంతకాలం స్తబ్దుగా ఉన్నా, మంత్రివర్గ విస్తరణ తర్వాత మళ్లీ ఎక్స్‌లో ట్వీట్లతో, నియోజకవర్గంలో కార్యక్రమాల్లో తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. సోషల్‌మీడియాపై సీఎం వ్యాఖ్యలను ఖండించడం, తనకంటే జూనియర్లకు పదవులిస్తున్నారని వ్యాఖ్యానించడం, ఎల్‌బీనగర్‌లో పోటీచేస్తే మంత్రిపదవి ఇచ్చేవారని, కానీ తానే మునుగోడు అభివృద్ధి కోసం ఇక్కడ పోటీచేశానని వ్యాఖ్యానించడం, మహబూబ్‌నగర్‌కు సీఎం పదవి, ఖమ్మం జిల్లాకు మూడు మంత్రిపదవులు ఇవ్వగా లేనిది నల్లగొండ జిల్లాకు మూడు పదవులిస్తే తప్పేంటని ప్రశ్నించడం ద్వారా చర్చకు తెరలేపారు. దీనికి కొనసాగింపుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఒక మీడియా ప్రకటనలో మంత్రి పదవి విషయంలో రాజగోపాల్‌రెడ్డికి అధిష్ఠానం మాట ఇచ్చింది వాస్తవమేనని, సమీకరణాలు కుదరక ఇవ్వలేకపోయారని పేర్కొనడంతో రాజగోపాల్ వాదనకు బలం చేకూర్చినట్లయింది. అనంతరం ఏ సమీకరణాలు ఎందుకు కుదరడం లేదని, తామిద్దరం అన్నదమ్ములం అనే విషయం మాట ఇచ్చినప్పుడు తెలియదా? అని రాజగోపాల్‌రెడ్డి అధిష్ఠానాన్ని మరోసారి నిలదీశారు. మరో సందర్భంలో రాజగోపాల్‌రెడ్డి సంస్థాన్ నారాయణపురం మిగతా 8వ పేజీలో...



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

బత్తాయిని కాపాడేందుకు ప్రభుత్వానికి సూచనలు చేస్తాం

● రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బత్తాయి పంటను కాపాడేందుకు ప్రభుత్వానికి సూచనలు చేస్తామని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. కమిషన్ రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో బత్తాయి రైతులు, ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిడమనూరు మండలంలో బత్తాయి తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడామన్నారు. జిల్లా కేంద్రం సమీపంలోని బత్తాయి మార్కెట్‌ను సందర్శించి రైతుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నామన్నారు. వీటిని క్రోడీకరించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. భవిష్యత్తులో బత్తాయి పంటను కాపాడేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. బత్తాయి మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత మార్కెటింగ్‌శాఖపై ఉందన్నారు. ప్రైవేట్ మార్కెట్‌ను ప్రభుత్వ మార్కెట్‌తో అనుసంధానం చేయాలన్నారు. సంప్రదాయ పంటగా ఉన్న బత్తాయిని నిర్లక్ష్యం చేస్తే రానున్న కాలంలో తోటలు కనపడకుండా పోతాయన్నారు. రైతు ఉత్పత్తి సంఘాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, వ్యవసాయ కమిషన్ ఆదేశాల మేరకు బత్తాయి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. రైతుల సూచన మేరకు బత్తాయి కాయలను పాఠశాలలు, హాస్టళ్లకు పంపిణీ చేసే విషయమై నివేదిస్తామన్నారు. సమావేశంలో వ్యవసాయ అధికారి శ్రవణ్, మార్కెటింగ్‌శాఖ అధికారి ఛాయాదేవి, వ్యవసాయ కమిషన్ ఓఎస్డీ గోపాల్, ఆర్డీవోలు అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, ఉద్యానశాఖ అధికారి అనంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే కుక్కల బారిన పడకుండా ఉంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం దేవరకొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఎక్కడబడితే అక్కడ చెత్త వేయడం వల్ల కుక్కలు, కోతుల సమస్య పెరుగుతోందన్నారు. వీధి, పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని జిల్లాలో మొదటిసారిగా దేవరకొండ నుంచే ప్రారంభించినట్లు తెలిపారు. మున్సిపల్‌శాఖ అధికారులు పట్టణంలో కుక్కల సంరక్షకులతో సమావేశం ఏర్పాటు చేసి రోడ్లపై వాటిని వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కల యజమానులను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో డానియెల్, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ విద్య కోసం పోరాటం: ఏఐఎస్ఎఫ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

హాలియా, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అందరికీ విద్య కోసం ఏఐఎస్ఎఫ్ పోరాడుతోందని సంఘం జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం హాలియాలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్రోద్యమంలో ఏఐఎస్ఎఫ్ అసమాన పోరాటాలు నిర్వహించిందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ నాయకులు కొర్ర రమేష్, రమావత్ శ్రీధర్, వంశీ, నరేష్, రాజు, మౌనిక, అలేఖ్య, గంగా, గణపతి, రాజేశ్వరి, మల్లేశ్వరి, మహేష్, పాల్గొన్నారు.


31 పీఏసీఎస్‌లకు స్పెషలాఫీసర్లు?

- ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన అధికారులు
- మిగిలిన పీఏసీఎస్‌ల బాధ్యతలు చైర్మన్లకు
- అధికారుల నివేదిక వివాదాస్పదమయ్యే అవకాశం

నల్లగొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): డిఫాల్ట్‌గా మారిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలపై చర్యలు చేపట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం రాజకీయ దుమారానికి తెరతీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. సహకార సంఘాల ఎన్నికలు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగాయి. ఆ ఎన్నికల్లో అత్యధికంగా ఆ పార్టీ నేతలు సహకార సంఘాల డైరెక్టర్లుగా, పీఏసీఎస్ చైర్మన్లుగా ఎన్నికయ్యారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత ఆయా నియోజకవర్గాలలో రాజకీయ అవసరాలకు అనుగుణంగా పలువురు చైర్మన్లు, డైరెక్టర్లు పార్టీ మారారు. ఇదిలా ఉండగా, పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం ఈనెల 14న గడువును పెంచుతూ జీవో జారీ చేసింది. అయితే అనూహ్యంగా పాలకవర్గాల గడువును నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. పీఏసీఎస్ చైర్మన్లకు బాధ్యతలు ఇవ్వకుండా డీసీవోలకు ఆదేశాలు జారీచేయడంతోపాటు చెక్ పవర్‌ను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే రాష్ట్రంలోని తొమ్మిది ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ల బాధ్యతలను యథావిధిగా కొనసాగిస్తూ, వారి సొసైటీల పాలకవర్గాలను మాత్రం కొనసాగేలా ఆదేశాలు ఇచ్చింది. ఉమ్మడి నల్లగొండ డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వ ఆదేశాల మేరకు బాధ్యతలు నిర్వహిస్తుండగా, పాలకవర్గంలోని సుమారు 19మంది డైరెక్టర్లు మాజీలుగా మిగిలారు.

31 సొసైటీల్లో స్పెషలాఫీసర్ల పాలన

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 108 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా, అందులో 31 ప్రాథమిక సహకార సంఘాలకు త్వరలో స్పెషలాఫీసర్లను నియమించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. అందుకు సంబంధించి మూడు జిల్లాలకు చెందిన డీసీవోలు ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం మేరకు నల్లగొండ జిల్లాలో 10 పీఏసీఎస్‌లకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తారని చర్చ సాగుతుండగా, సూర్యాపేట జిల్లాలో 12 సొసైటీలకు, యాదాద్రి జిల్లాలో తొమ్మిది సొసైటీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తారని తెలిసింది. ఈ 31 సొసైటీలను గతంలో నిర్వహించిన ఆడిట్ ప్రకారం డిఫాల్టరుగా చేసినట్టు తెలిసింది. అయితే అధికారులు చూపించిన కారణాలను ఆ సొసైటీల పాలకవర్గాలు అంగీకరిస్తాయా? లేక కోర్టును ఆశ్రయిస్తాయా? అనేది తేలాల్సి ఉంది. జిల్లా సహకార అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు ఉండి ఆయా సొసైటీలను సముచిత కారణాలు లేకుండా డిఫాల్టర్ల జాబితాలో చేర్చితే సమస్య జటిలంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాథమిక సహకార సంఘాలను రద్దు చేయాలంటే ప్రధానంగా సరైన కారణాలు చూపించాల్సి ఉంటుంది. ఆయా సొసైటీలు సహకార సూత్రాలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉండటంతో పాటు, నష్టాలలో ఉంటే బాధ్యత వహించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఏదైనా సొసైటీలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకోవడంతో పాటు సభ్యుల సంఖ్య తగ్గితే అయితే ఆయా సొసైటీలపై



చర్యలు తీసుకుంటారు. సహకార సెక్షన్లు 35తోపాటు 36 ప్రకారం డిఫాల్ట్ గా మారిన సొసైటీలను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. సంఘాలను రద్దు చేసిన విషయంలో కారణాలను స్పష్టంగా వెల్లడించాల్సి ఉంటుంది.

రాజకీయ రగడకు దారితీసే అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం అనూహ్యంగా సహకార సంఘాలపై తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయ రగడకు దారితీసే అవకాశాలు మిగతా 6వ పేజీలో...

వ్యసనాలకు బానిస కావొద్దు

జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.నాగరాజు

నల్లగొండ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు బానిసకాకుండా సమాజంలో మంచి మనుషులుగా ఎదగాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.నాగరాజు అన్నారు. శనివారం నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఎలాంటి నేరాలకు, వ్యసనాలను లోనుకాకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఒకసారి కేసు నమోదైతే భవిష్యత్లో ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగం రాదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థులకు మంచి లక్షణాలు ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ, కళాశాలలో ఇలాంటి న్యాయ అవగాహన సదస్సులు నెలకు ఒకటి నిర్వహించాలని కోరారు. జిల్లా అదనపు న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి కె.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చట్టానికి సంబంధించిన విషయాలు సాధారణంగా బోర్‌గానే ఉంటాయని, కానీ వాటితో పనిపడినప్పుడు అవి ఇష్టంగా మారుతాయన్నారు. ప్రతీ విద్యార్థికి చట్టాలపై కనీస అవగాహన ఉండాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడుతున్నప్పుడు హీరోలాగా ఫీల్ అవుతామని, కానీ ఆ తరువాత దాని ప్రభావం కనిపిస్తుందన్నారు. జీవితంలో దవాఖానాకు, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వి.పురుషోత్తంరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి చత్రునాయక్, ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కె.అనంతరెడ్డి, కందుకూరి సుదర్శన్, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అంతటి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్, సుధాకర్, అనిల్‌కుమార్, వెంకటరెడ్డి, మల్లేశం, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి నాగరాజు

ఈకేవైసీ నూరుశాతం పూర్తిచేయాలి

జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి

నల్లగొండ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిపొందుతున్న వారి వివరాలు ఈకేవైసీ నూరుశాతం పూర్తిచేయాలని శిశు సంక్షేమశాఖ అధికారి కేవీ.కృష్ణవేణి అన్నారు. శనివారం ప్రాజెక్టు పరిధిలోని చర్లపల్లి సెక్టార్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈకేవైసీ ప్రకారంగానే నిధులు విడుదలవుతాయని అన్నారు. ఈ మేరకు లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం ఈకేవైసీ 96శాతం పూర్తయిందని, వెంటనే నూరుశాతం పూర్తిచేయాలన్నారు. అప్పుడే వచ్చే నెలకు సంబంధించిన ఇండెంట్ వస్తుందని తెలిపారు. ఆన్‌లైన్ పూర్తయినవారికి మాత్రమే పౌష్టికాహారం అందించే వీలుంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సమయానికి తెరవాలని, సిబ్బంది యూనిఫామ్ ధరించాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున అద్దె భవనాలు శిథిలావస్థలో ఉంటే వెంటనే వాటిని మార్చాలన్నారు. మరమ్మతులు చేయించాలన్నారు. సమావేశంలో కుర్షిదాబేగం, సుశీల, విజయ, రజిత, మంగ, సావిత్రమ్మ, పక్కతాంబ, సునంద, పుష్పమ్మ, శంకరమ్మ, లావణ్య, లక్షమ్మ, శిరీష, అనిత, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

పేదల డాక్టర్ రాములునాయక్ మృతి



నేడు అంత్యక్రియలు

దేవరకొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండ్‌గా 22 ఏళ్లు పనిచేసి పేదల వైద్యుడిగా పేరొందిన డాక్టర్ రాములునాయక్ గుండెపోటుతో శనివారం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలియగానే పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు, వైద్యులు, రాజకీయ పార్టీల నాయకులు దేవరకొండలోని డాక్టర్ స్వగృహానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

రాములునాయక్ దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి సూరింటెండెంట్‌గా 22 ఏళ్లు విధులు నిర్వహించారు. 2024లో కల్వకుర్తికి బదిలీ అయ్యారు. దేవరకొండలో సొంతంగా ఆస్పత్రిని ఏర్పాటు చేసి పేదలకు తక్కువ ఫీజుతో వైద్యాన్ని అందించారు. రాములునాయక్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె డాక్టర్ ప్రవళిక దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మరణ వార్త విని పలువురు పట్టణ ప్రజలు కంటతడి పెట్టారు. కాగా, రాములునాయక్ అంత్యక్రియలు ఆదివారం ఆయన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

రాములునాయక్ మృతి తీరనిలోటు : ఎమ్మెల్యే బాలునాయక్

రాములునాయక్ మృతి పేద ప్రజలకు తీరని లోటని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. రాములునాయక్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఎంతోమంది పేదలకు, రోగులకు రాములునాయక్ వైద్యాన్ని అందించారని గుర్తుచేశారు. అదేవిధంగా దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ నివాళులు అర్పించారు. రాములునాయక్ మృతిపై డీసీహెచ్ఎస్ డాక్టర్ మాతృనాయక్, డాక్టర్ రవిప్రకాష్, వేణుధర్‌రెడ్డి, కృష్ణ, మోతిలాల్, మంగ్తానాయక్, ఆలంపల్లి నర్సింహ, సిరాజ్‌ఖాన్, పల్లా నర్సింహరెడ్డి, బెజవాడ శేఖర్, వస్కుల సుధాకర్, గుండాల అంజయ్య యాదవ్, తదితరులు సంతాపం తెలిపారు.

సాగర్ 26 గేట్ల ద్వారా కొనసాగుతున్న

నీటి విడుదల

- మూసీకి వరద కొనసాగుతున్న వరద ఉధృతి 7

నల్లకొంగలతో బెంగ

- నాట్లు పిలక దశ వచ్చేవరకు తవ్వి తొక్కుతున్న కొంగలు
- తిరిగి నాట్లు వేసుకోవాల్సి వస్తుందని రైతుల ఆవేదన 6

సామాజిక సేవలో మనం

● బాటసారుల ఆకలి తీరుస్తున్న మనం స్వచ్ఛంద సంస్థ ● ప్రతిరోజూ 100 మందికి తగ్గకుండా అన్నదానం ● నిత్యాన్నదాన యజ్ఞానికి 365 రోజులు



365వ రోజుకు చేరుకున్న సందర్భంగా 'మనం' స్వచ్ఛంద సంస్థ అన్నదాన యజ్ఞం

అతనో సామాన్య వ్యక్తి. ఒంటరిగా, మెండైన ఆత్మవిశ్వాసంతో మొదలుపెట్టిన అన్నార్తుల ఆకలి తీర్చే సేవ ఏడాదిగా కొనసాగుతోంది. కష్టం, నష్టం ఎన్ని ఎదురైనా వెనకడుగు వేయలేదు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన దైద నాగరాజు ఒక్కడే 'మనం' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి అన్నీ తానై ఏడాదిగా ప్రతి రోజూ వంద మంది ఆకలి తీరుస్తున్నాడు. అన్నార్తులు, బాటసారుల ఆకలి తీరుస్తూ అభినందనలు అందుకుంటున్నాడు.

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

ఎస్‌ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలను సాధించే తపనలో భాగంగా హైదరాబాద్ దిల్‌షుఖ్‌నగర్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో చేరి శిక్షణ తీసుకుంటున్న సమయంలో నాగరాజుతో పాటు ఎంతోమంది హరేకృష్ణ సంస్థ ద్వారా ప్రభుత్వం నిర్వహిస్తున్న రూ.5 భోజనం వద్దే తినేవాళ్లు. పేదరికాన్ని అనుభవిస్తూ నలుగురైదుగురు యువకులు కలిసి ఓ చిన్నగదిని అద్దెకు తీసుకుని కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతూ రూ.5 భోజనం చేసిన పరిస్థితి స్వయంగా అనుభవించిన నాగరాజుకు ఈ పరిస్థితులే ప్రేరణ కల్పించాయి. దీంతో పాటు హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ లాంటి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల వద్ద ఎక్కడెక్కడి నుంచో వచ్చే ఎంతో మంది రోగుల బంధువులు స్వచ్ఛంద సంస్థలు అందించే అల్పాహారం, భోజన ప్యాకెట్ల కోసం ఎదురుచూసే పరిస్థితులు అతడిలో నిత్యాన్నదాన కార్యక్రమానికి పురికొల్పాయి. కొద్ది పాటి తేడాతో తనకు ఉద్యోగాలు రాకపోయినా నిరుత్సాహపడని నాగరాజు తిరిగి స్వగ్రామం నార్కట్‌పల్లికి వచ్చాడు. మనం అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి ప్రతి రోజూ బాటసారులకు కనీసం 100 మందికి తగ్గకుండా అన్నదానం చేస్తున్నాడు. ఈ నెల 30వ తేదీకి అది 365 రోజులకు చేరింది. దాతలు ఎవరైనా ఉంటే వారి సహకారంతో లేకుంటే సొంత ఖర్చుతోనే నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నాగరాజు ఏడాదిగా కొనసాగిస్తున్నారు.

ఇతరులకు ఆదర్శంగా నిలవాలని..



సామాజిక సేవతో పదిమందికి ఆదర్శంగా నిలవాలని, దగ్గరవ్వాలనే ఆలోచనతోనే మనం స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి, నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నా. 2020లో కరోనా విపత్తులో కరోనా బాధితులు ఎందరో అకాల మరణం చెందారు. ఆ ఘటనల తర్వాత 'మనం' పోయినా మన సేవలు ప్రజల మదిలో పదికాలాలు గుర్తుండిపోవాలనే సంకల్పించా. సమాజంతో నేను అనే భావం వచ్చేలా సంస్థకు 'మనం' అనే పేరు పెట్టా. దాతల సహకారంతో ఈ యజ్ఞాన్ని కొనసాగించా. కొన్నిరోజులు దాతలు లేకపోయినా సొంత ఖర్చుతో అన్నదానం చేశా. ఇప్పటివరకు రూ.1.50లక్షలు ఖర్చు చేశా. అయినా బాధలేదు. ఎంతోమంది ఆకలి తీర్చానన్న ఆనందం ఉంది.

దైద నాగరాజు, మనం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు

మద్యం మత్తులో ఆత్మహత్య



రమణారెడ్డి(ఫైల్‌ఫొటో)

నిడమనూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం తుమ్మడం గ్రామంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జరిగింది. ఎస్‌ఐ ఉప్పు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం తుమ్మడం గ్రామానికి చెందిన దుబ్బాకుల రమణారెడ్డి(46) కిరాణం దుకాణం నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో తాను చనిపోతునాన్నని తన అత్తకు ఫోన్ చేసి తెలిపాడు. చెప్పినవిధంగానే దుకాణంలో చీరతో ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు దుకాణం షట్టర్ తెరిచి చూడగా రమణారెడ్డి అప్పటికే చనిపోయిఉన్నాడు. రమణారెడ్డి తమ్ముడు దుబ్బాకుల కోటిరెడ్డి శనివారం నిడమనూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం

అనంతగిరి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలో స్నేహితులతో కలిసి పందెంలో భాగంగా పాలేరు వాగులో దూకి గల్లంతైన కిన్నెర ఉపేందర్ మృతి చెందాడు. శనివారం ఆయన మృతదేహం దూకిన ప్రదేశానికి కూతవేటు దూరంలో లభ్యమైంది. గురువారం సాయంత్రం సమాచారం అందిన వెంటనే కోదాడ రూరల్ సీఐ అనంతగిరి, ఎస్‌ఐ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసులు, గ్రామస్థులు కలిసి గల్లంతైన ఉపేందర్ కోసం తీవ్రంగా గాలించారు. చుట్టుపక్కల ఉన్న చెక్‌డ్యాంల వద్ద నిఘా ఉంచారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు పోలీసులకు కూడా సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం ఐదు గంటల నుంచి పోలీసులు ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బందితో కలిసి పడవ సహాయంతో రాత్రి 10 గంటల వరకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. కొత్తగూడెం గ్రామంలో చెక్ డ్యాం నుంచి మృతదేహం కిందకు వెళ్లకుండా స్థానిక మత్స్యకారులు, గ్రామస్థులు డ్రాగన్ లైట్ల సహాయంతో పరిశీలించారు. శనివారం ఉదయం ఐదు గంటల నుంచి గాలింపు ప్రయత్నాలను ప్రారంభించగా ఏడున్నర గంటల సమయంలో నీటిలో తేలియాడుతున్న ఉపేందర్ మృతదేహం లభించింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పోలీసులు, స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫోర్స్ అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

ఎల్బీనగర్లో దొంగతనం



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ చలికంటి నరేష్

గరిడేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం ఎల్బీనగర్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు, ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్బీనగర్ గ్రామానికి చెందిన వల్లభనేని శ్రీనివాసరావు ఆరోగ్య సమస్యలతో విజయవాడలోని ఆసుపత్రికి కుటుంబంతో కలిసి శుక్రవారం వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. శనివారం ఉదయం పనిమనిషి శ్రీనివాసరావు ఇంటి వద్దకు వెళ్లగా తలుపులు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి గ్రామస్థులకు తెలిపింది. వారి సమాచారంతో ఎస్‌ఐ నరేష్ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విషయాన్ని ఫోన్ ద్వారా శ్రీనివాసరావుకు తెలపగా ఇంట్లో కొంత బంగారం ఉన్నట్లు చెప్పినట్లు స్థానికులు తెలిపారు. పోలీస్ క్లూస్ టీం ఆధారాలను సేకరించింది.

తృటిలో తప్పిన ప్రమాదం



డివైడర్‌పై స్తంభాన్ని ఢీకొట్టిన బస్సు

కొండమల్లేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : బస్సు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్ల ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు హైదరాబాద్‌కు బయలుదేరింది. కొండమల్లేపల్లి పట్టణ చౌరస్తాకు చేరుకోగానే బస్టాండు సమీపంలో డ్రైవర్ నిద్రమత్తు వల్ల తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో డివైడర్‌పైకి ఎక్కి కొంతదూరం వరకు వెళ్లి విద్యుత్ స్తంభాలను ఢీకొని ఆగింది. ఆ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

త్రిపురారం మండలంలో రైతుల వరిపొలాల్లో వాలిన నల్లని కొంగలు



నల్లకొంగలతో బెంగ

● నాట్లు పిలక దశ వచ్చేవరకు తవ్వి తొక్కుతున్న కొంగలు

● తొక్కిన మళ్లలో తిరిగి నాట్లు వేసుకోవాల్సి వస్తుందని రైతుల ఆవేదన

వరినాట్లకు నల్లకొంగల బెడద ఎక్కువైంది. సాధారణంగా తెల్లకొంగలనే చూస్తుంటాం. కానీ కాకుల రంగులో ఉండే నల్లకొంగలు గుంపులుగా తిరుగాడుతూ వరినాట్లను తొక్కి పాడుచేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దగ్గరకు వెళ్లి గట్టిగా అరిస్తేనే వెళ్తున్నాయంటున్నారు. తెల్లకొంగల కన్నా నల్లకొంగలు మరింత నష్టపరుస్తున్నాయని అంటున్నారు. గుంపులుగా వచ్చి ఆహారం కోసం తిరుగుతూ వరినాట్లను బురదలోకి తొక్కివేస్తుండటంతో నష్టం జరుగుతోందని రైతులు వాపోతున్నారు.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)



సాయంత్రం ఐదు గంటల తరువాత, తెల్లవారు జామున ఏడు గంటల వరకు నల్లకొంగలు వరి పొలాలపై వాలుతున్నాయంటున్నారు. దమ్ముజేసిన నాటి నుంచి నాట్లు వేసిన 15రోజుల వరకు కొంగలు వాలకుండా కాపలా ఉండాల్సి వస్తోందంటున్నారు. తెల్లకొంగలు చివరి మడిలో వాలినా రైతుకు కనిపిస్తుంది కాబట్టి వాటిని వెళ్లగొట్టడానికి ప్రయత్నిస్తారని మునిమాపు వేళలో, ఉదయం పూర్తిగా తెల్లవారకముందే నల్లకొంగలు పొలాలపై పడి వేసిన నాట్ల కింది భాగంలో ముక్కులతో పొడిచి వానపాములను. కీటకాలను తినడంతో వరినాట్ల వేర్లు భూమిలో పాదుకొనక పైకి తేలి ఎండిపోవడమో, చనిపోవడమో జరుగుతుందంటున్నారు. పొలంలో తిరుగుతున్న సమయంలో వరి మొలకలపై అడుగులు వేయడం వల్ల అవి బురదలో కూరుకపోయి కుళ్లిపోతున్నట్లు చెబుతున్నారు. తెల్లకొంగల కంటే నల్లకొంగలు బరువు ఎక్కువగా వుండటంతో నాట్లు తిరిగి నిలవడంలేదని వాపోతున్నారు.

పెద్ద పక్షి నల్లకొంగ

కొంగ కుటుంబానికి చెందిన పెద్ద పక్షి నల్లకొంగ. శాస్త్రీయ నామం సికోనియా నిగ్రా. ఐరోపా దేశాల్లోని ఈ తరహా కొంగలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. సంతానోత్పత్తి కోసం ఉష్ణ మండల దేశాలకు వస్తుంటాయని అంటున్నారు. వర్షాకాలం, శీతాకాలంలో ఎక్కువగా వలస వస్తాయని చెబుతున్నారు. ఎక్కువగా చెరువులు, వాగుల చుట్టూ పెరిగే చెట్లను నివాసంగా చేసుకుని గుంపులుగా ఆహారం కోసం పొలాలపైకి వస్తాయంటున్నారు. తెల్లకొంగల కంటే నల్లకొంగలు పొడవు, బరువును ఎక్కువగా ఉంటాయని కీటకాలను, చేపపిల్లలను ఎక్కువగా ఆహారంగా తీసుకుంటాయని అంటున్నారు.

కొత్తనాట్ల మధ్య తిరుగాడుతున్న ఎర్రలు, బురద పురుగుల కోసం పెద్దసంఖ్యలో నల్లకొంగలు పొలాలపై వాలుతుండటంతో అవివాలిన చోట మొక్కలు చావడంతో తిరిగి నాటు వేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోందని అంటున్నారు. దీంతో సమయానికి నారు దొరక్క, నాట్లు వేసేందుకు కూలీ దొరక్క ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ముఖ్యంగా వంపు పొలాల్లో నల్లకొంగలు బెడద ఎక్కువగా ఉంటుందని రైతులు అంటున్నారు. వర్షాల కారణంగా లోతట్టు, పల్లపు ప్రాంత పొలాలపై వరద ప్రవహించడంతో అనేక రకాల జలచరాలు పొలాల్లోకి వస్తుండటంతో నల్లకొంగలు పొలాలపై వాలి ఆహారం కోసం వరి మొక్కలను నాశనం చేస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు.

30గుంటల పొలాన్ని పాడు చేశాయి



నాలుగు ఎకరాల పొలం నాటు వేశా. మాది వంపు పొలం. రెండు మూడు రోజుల పాటు తెల్లకొంగలు వాలకుండా కాపలా కాశా. పులకతడి పెట్టి పక్షుల కాపలా మానేశా. ఎక్కడి నుంచో నల్లకొంగల గుంపు సాయంత్రం వచ్చి పొలం అంతా తొక్కడంతో అనేక చోట్ల నాట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. సుమారు 30 గుంటల వరకు మొక్కలు లేకుండా పోయాయి. నలుగురు మనుషులను పెట్టి తిరిగి నాట్లు వేసుకోవాల్సి వచ్చింది.

వంగాల శ్రీనివాసరెడ్డి, రైతు, నీలాయిగూడెం

పక్షులను భయపెట్టాలి



నల్లకొంగలు నాట్లను తొక్కడంతో మొక్కలు చనిపోయి రైతులకు నష్టం కలుగుతోంది.వాటిని పొలాల్లోకి రాకుండా భయపట్టాలి. పొలాల్లో బెదురు కర్రలు ఏర్పాటుచేయాలి. రిబ్బన్, రీల్స్ లాంటివి కర్రలకు చుట్టడం వల్ల గాలి వీచినప్పుడల్లా అవి ఊగుతూ ఎండకు మెరుపులు లాగా కాంతిని వెదజల్లి పక్షులను భయపెడతాయి. వీలుంటే టపాసులు పేల్చి పెద్ద శబ్దాలు సృష్టించడం ద్వారా వాటిని భయపెట్టి పొలం నుంచి పారద్రోలవచ్చు.

సైదానాయక్, ఇన్‌చార్జి ఏడీఏ

కల్తీ కోళ్లదాణా తయారీ కేసులో ఇద్దరి అరెస్ట్



కేతేపల్లిలో పట్టుబడిన కల్తీ కోళ్లదాణా డీసీఎంతో సీఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ సతీష్‌వర్మ

కేతేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కోళ్ల దాణాలో ఇసుక కలిపి కల్తీకి పాల్పడుతున్న ఇరువురిని నల్లగొండ జిల్లా కేతేపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామానికి చెందిన ఆల్దాస్ సతీష్, బుద్దె కృష్ణలు కేతేపల్లిలో హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి వెంట పాడుబడిన రైస్‌మిల్లును అద్దెకు తీసుకున్నారు. అందులో స్థానికంగా ఉన్న రైస్‌మిల్లుల నుంచి సేకరించిన తవుడు, నూకలు, పరం కలిపి కోళ్ల దాణా తయారు చేసి డీసీఎంలలో హైదరాబాద్‌కు తరలించి విక్రయిస్తుంటారు. కొన్నాళ్లుగా ఈ వ్యాపారం చేస్తున్న వీరు సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో పశువులు, కోళ్ల దాణాలో 30శాతం మేర సన్నని ఇసుక కలుపుతూ కల్తీకి పాల్పడుతున్నారు. ఈ క్రమంలో కల్తీ వ్యవహారం సమాచారం అందుకున్న కేతేపల్లి ఎస్‌ఐ సతీష్‌వర్మ తన సిబ్బందితో దాణా తయారీ కేంద్రంపై దాడి చేసి అక్కడి నిల్వ ఉన్న దాదాపు రూ.3.30లక్షల విలువైన 245బస్తాలు(122.50 క్వింటాళ్లు) దాణా, ఒక డీసీఎం వ్యాన్, టాటా నెక్సాన్ కారు, దాదాపు ఎనిమిది టన్నుల ఇసుక, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు సీఐ కొండల్‌రెడ్డి తెలిపారు. కల్తీ దాణా తయారీ, విక్రయం చేస్తున్న ఆల్దాస్ సతీష్, బుద్దె కృష్ణలను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఆయన వివరించారు. కల్తీ వ్యాపార గుట్టురట్టు చేసిన ఎస్‌ఐ సతీష్‌వర్మ, ఇతర సిబ్బందిని ఎస్పీ శరత్‌చంద్రపవార్, డీఎస్పీ శివరాంరెడ్డిలు అభినందించినట్లు ఆయన తెలిపారు.

ముగిసిన ఐటీఎఫ్ అండర్-18 టోర్నీ



టోర్నీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

భువనగిరి టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో వారం రోజులుగా నిర్వహిస్తున్న రాజా నర్సింహారావు మెమోరియల్ ఇండియన్ టెన్నిస్ ఫెడరేషన్(ఐటీఎఫ్) అండర్ -18 బాల, బాలికల టోర్నీ శనివారంతో ముగిసింది. అన్నికేటగిరీల ఫైనల్స్ ఉత్కంఠభరితంగా సాగాయి. అండర్-18 బాలుర డబుల్స్‌లో ఫ్రాన్స్‌కు చెందిన థామస్ కాపీ ఇండియాకు చెందిన ప్రణవ్ మహేష్ సవరణ్‌కుమార్‌తో కలిసి స్థానిక జట్టుపై గెలిచి విజేతగా నిలిచారు. మిగతా అన్ని కేటగిరీలలోనూ ప్రథమ, ద్వితీయ బహుమతులు భారత క్రీడాకారులే సాధించారు. సుమారు 10 దేశాలకు చెందిన 200 మందికి పైగా క్రీడాకారులు, 100మంది వరకు అధికారులు కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు. అండర్ -18 బాల, బాలికల సింగిల్స్ డబుల్స్ బాలుర సింగిల్స్ డబుల్స్ కేటగిరీలలో పోటీలు నిర్వహించారు.

విజేతలు వీరే

అండర్ -18 బాలుర సింగిల్స్‌లో వ్రజ్ గోహిల్(ప్రథమ), డెన్ విఫుల్ పటేల్ (ద్వితీయ) స్థానంలో నిలిచారు. బాలికల సింగిల్స్‌లో స్నిగ్ధకాంత (ప్రథమ), ఐశ్వర్య జాదవ్(ద్వితీయ), అండర్-18 డబుల్స్ ఫైనల్స్‌లో బాలుర విభాగంలో థామస్ కాపీ, ప్రణవ్ మహేష్ జోడి(ప్రథమ), సవరణ్‌కుమార్, హృతిక్ కఠకం(ద్వితీయ), బాలికల విభాగంలో నైనికా నరేందర్‌రెడ్డి, స్నిగ్ధకాంత జోడి(ప్రథమ), శ్రీనిత్ని చౌదరి, హర్షకార్తిక ఊరగంటి(ద్వితీయ) సాధించారు. విజేతలకు తెలంగాణ టెన్నిస్ ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, న్యూడైమెన్షన్ ఎండీ సుభాష్‌రెడ్డి, జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి, టీఎస్‌టీఏ మేనేజర్ వైభవ్ పటేల్ బహుమతులు అందజేసి అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ టోర్నీలో...



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న యాదాద్రిభువనగిరి జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీ సింథటిక్ ట్రాక్‌లో జి.రాజేంద్రప్రసాద్ స్మారక 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-14, 16, 18, 20 జూనియర్ బాల, బాలికల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. అండర్-18 బాలుర 5వేల పరుగులో ధోని(నల్గొండ) తృతీయ స్థానం సాధించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

మర్రిగూడ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం సరంపేట గ్రామశివారులోని శ్రీస్తంభగిరి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ కల్యాణ మండపంపై శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలను చేపట్టారు. 30 ఏళ్ల కిందట లక్ష్మీనృసింహస్వామి కల్యాణంకోసం, మండపాన్ని నిర్మించారు. అయితే ఈ మండపంపై కన్నువేసిన దుండగులు తవ్వకాలు చేశారు. శనివారం ఉదయం ఆలయ పూజారి దేవాలయానికి పూజ కోసం వెళ్లగా తవ్వకాలను గుర్తించారు. చుట్టుప్రక్కల గ్రామస్థులను పిలిపించి తవ్వకాలను పూజారి చూపించారు. ఈ తవ్వకాలపై పూజారి పోలీస్‌స్టేషన్ తెలియపర్చినట్లు వెల్లడించారు. ఎస్‌ఐ కృష్ణారెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఫోన్‌లో సమాచారం తెలిపారని, రాతపూర్వకంగా ఫిర్యాదు చేయలేదన్నారు.

31 పీఏసీఎస్‌లకు స్పెషలాఫీసర్లు?

(5వ పేజీ తరువాయి)

కనిపిస్తున్నాయి. అనుకూలంగా ఉన్న సొసైటీ పాలకవర్గాలు డిఫాల్టర్లుగా ఉన్నా, వాటిని కొనసాగించి, అనుకూలంగా లేని పాలకవర్గాలను రద్దు చేస్తే వివాదాస్పదం అయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల పాలకవర్గాల గడువు పెంచకుండా నిలిపివేసి అకస్మాత్తుగా డిఫాల్టర్లుగా మారిన సొసైటీల లెక్కలు తేల్చాలని డీసీవోలకు ఆదేశాలు ఇవ్వడం ఆయా సంఘాల పాలకవర్గాలను ఆందోళన గురిచేస్తోంది. ఓవర్ డ్యూతోపాటు, లోన్ రికవరీలో ఇబ్బందులు, మంజూరు అయిన రుణాలను సంఘాలు ఖర్చు చేయకపోవడం, సంఘాల బలోపేతంపై దృష్టి సారించకపోవడం అనేది కూడా డిఫాల్ట్‌గా చూపించే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా సొసైటీ పాలకవర్గాలు సమస్యను ఎదుర్కోనున్నాయని తెలుస్తోంది. ప్రభుత్వం ఇటీవల జిల్లా సహకార అధికారులకు సొసైటీల డిఫాల్టర్ల విషయంలో విశేష అధికారాలను కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మూడు జిల్లాల సహకార అధికారులు ఆడిట్ రిపోర్టు ఆధారంగా ఆయా సొసైటీలపై చర్యలు తీసుకునేందుకు ఉపక్రమించడంతో పాటు, ఏకంగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే ఇప్పటివరకు ఉన్న సమాచారం మేరకు ఉమ్మడి జిల్లాలో 31 సొసైటీలకు స్పెషలాఫీసర్లను నియమించే అవకాశాలు ఉన్నాయి.

డీసీసీబీ అభివృద్ధి పథంలో ఉన్న సమయంలో..

నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రస్తుతం రూ.3వేల కోట్ల టర్నోవర్‌కు దగ్గరలో ఉంది. రాష్ట్రంలోనే రెండోస్థానంలో నిలిచింది. ప్రస్తుతం పాలకవర్గం తీసుకున్న పలుకీలక నిర్ణయాలు బ్యాంక్ అభివృద్ధికి దోహదంచేశాయి. రైతుల రుణాలతో పాటు స్వల్పకాలిక, దీర్ఘకాలికరుణాలు, గోల్డ్‌లోన్లు, విద్యారుణాలు పెద్దమొత్తంలో ఇచ్చారు. దీంతో పాటు రికవరీ కూడా పెరగడంతో పాలకవర్గానికి, ఉద్యోగులకు మంచి పేరు వచ్చింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం డిఫాల్టర్ల పేరుతో కొన్ని సొసైటీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తే ఆయా సొసైటీల్లో అభివృద్ధి కుంటుపడే అవకాశాలు ఉన్నాయని చర్చ సాగుతోంది. సొసైటీల్లో లోపాలు ఉంటే సరిదిద్దడం వల్లే ఉపయోగం ఉంటుందని, లేదంటే ఆయా సొసైటీలపై రైతులు, ప్రజల్లో చిన్నచూపు ఏర్పడి సొసైటీల అభివృద్ధిపై ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం డిఫాల్టర్ల సొసైటీలపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే దానిపై ఆసక్తి నెలకొంది. అన్ని పీఏసీఎస్‌ల పాలకవర్గాలను కొనసాగిస్తారా? లేదంటే డిఫాల్టర్ల సొసైటీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తారా? వేచి చూడాల్సిందే.

రోడ్డు ప్రమాదంలో జవాన్ మృతి



శ్రీను(ఫైల్ ఫొటో)

ఆత్మకూరు(ఎస్), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : తన చెల్లెలు అత్త కర్మ క్రియలకు వెళ్తూ బీఎస్‌ఎఫ్ జవాన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు(ఎస్) మండలం ఏనుబాముల గ్రామానికి చెందిన ఒడిశా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో జవాన్‌గా పనిచేస్తున్న కలకోట్ల శ్రీను తన చెల్లెలు అత్తగారి ఊరైన చివ్వెంలకు బయలుదేరాడు. బీబీగూడెం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో శ్రీను స్వగ్రామంలో విషాదం చోటుచేసుకుంది. మరో మూడేళ్లలో రిటైర్మెంట్ కానున్న శ్రీను శనివారం మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

స్పిన్నింగ్ మిల్లు సీజ్

పెద్దవూర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా పెద్దవూర మండల కేంద్రంలోని భోగమలో స్పిన్నింగ్ మిల్లును సీజ్ చేసినట్లు నాగార్జునసాగర్ సీఐ శ్రీనునాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విశ్వనాథ స్పిన్నింగ్ మిల్లును ముంబాయికి చెందిన భోగమలో ప్రైవేట్ లిమిటెడ్ యజమాన్యం సౌరబ్ ప్రదాన్‌కు ఎనిమిదేళ్లకు లీజుకు ఇచ్చారు. అదే సమయంలో స్పిన్నింగ్ మిల్లుకు సంబంధించి రా మెటీరియల్ పంపిణీ చేసేందుకు గజ్వేల్‌కు చెందిన తిరుమల ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన బుక్క రమేష్‌తో సౌరబ్ ప్రదాన్ ఒప్పందం చేసుకున్నారు. ఆ మేరకు ఈ ఏడాది జూలైలో రూ.2,20,64,000 రా మెటీరియల్‌ను రమేష్ పంపించారు. అయితే అందుకు సంబంధించిన డబ్బులు సౌరబ్ ప్రదాన్ చెల్లించలేదు. ఇదే సమయంలో విశ్వనాథ స్పిన్నింగ్ యజమాన్యం, సౌరబ్ ప్రదాన్ మధ్య గొడవలు మొదలయ్యాయి. దీంతో మిల్లులో తయారైన పత్తి ధారాలను విక్రయించనివ్వలేదు. ఈ విషయాన్ని సౌరబ్ ప్రదాన్ రమేష్‌కు తెలియజేశాడు. దీంతో బిల్లు చెల్లించకుండా మిల్లు యజమాన్యాలు కుమ్మక్కై డబ్బులు ఇవ్వడం లేదంటూ గజ్వేల్‌కు చెందిన బుక్క రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ శ్రీనునాయక్ తెలిపారు. పంచనామా అనంతరం స్పిన్నింగ్ మిల్లును సీజ్ చేసి చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా భోగమలో ఎంటర్‌ప్రైజెస్‌కు, విశ్వనాథ స్పిన్నింగ్ మిల్లు యజమాన్యానికి గొడవ జరుగుతున్న తరుణంలోనే స్పిన్నింగ్ మిల్లు పేరును కూడా మార్చినట్లు సీఐ శ్రీనునాయక్ తెలిపారు.

ఇసుక డంప్ సీజ్

రాజాపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం బేగంపేట, రేణికుంట గ్రామాల పరిధిలోని వాగు పక్కన ఇసుక అక్రమ డంప్‌ను అధికారులు సీజ్ చేశారు. వాగులో నుంచి కొంతమంది అక్రమంగా ఇసుకను తరలించి నిలువ చేశారు. ఈ విషయంపై గ్రామస్థులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో తహసీల్దార్ అనిత, ఎస్‌ఐ అనిల్‌కుమార్ డంప్ ప్రాంతాన్ని సీజ్ చేశారు. వాల్టా చట్టం ప్రకారం ఇసుకను అక్రమంగా తరలించి డంప్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. అదేవిధంగా బేగంపేట గ్రామంలోని వాగు నుంచి కొందరు ఇసుకను తరలిస్తున్నారని పోలీస్‌లకు సమాచారం రావడంతో వారు అక్కడికి వెళ్లి రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని తహసీల్దార్‌కు అప్పగించారు.

స్పేస్‌మిషన్ వ్యోమగామి అభ్యర్థిగా తెలుగుతేజం

- హుజూర్‌నగర్‌వాసి మోహన్‌సాయికి అరుదైన అవకాశం
- తెలుగు రాష్ట్రాల నుంచి ఒకే వ్యక్తి ఎంపిక
- అంతర్జాతీయ శాస్త్రవేత్తలతో కలిసి పనిచేసే అవకాశం

హుజూర్‌నగర్ , ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఆకుల మోహన్‌సాయి 2029 టైటాన్స్ స్పేస్ మిషన్ వ్యోమగామి అభ్యర్థిగా ఎంపికయ్యారు. భారతదేశంలో పెరుగుతున్న అంతరిక్ష ఆకాంక్షలను ప్రపంచ ఆస్ట్రోనాటిక్స్‌తో అనుసంధానించే కీలకఅడుగులో భాగంగా టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ టీఎస్ఐ రెండు రోజుల క్రితం ప్రకటించిన 2029 వ్యోమగామి అభ్యర్థుల (ఎఎస్‌సీఎఎన్) బృందంలో మోహన్‌సాయి చోటు దక్కించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఒకే వ్యక్తి ఎంపిక కావడం గమనార్హం. భారత్ నుంచి ఆస్ట్రోబయోలజీ అండ్ స్పేస్ సైన్స్‌లో పట్టభద్రులైన తొలి తరానికి చెందిన మోహన్ సాయి ఈ ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ బృందంలో తెలుగు రాష్ట్రాల ప్రతినిధిగా నిలిచారు.

నీలా (ఎస్ఎస్ఎల్) లాక్‌మాన్ స్థాపించిన టీఎస్ఐ జెన్‌సీస్ స్పేస్ ప్లే అనే పునర్వినియోగ సింగిల్ -స్టేజ్ - 2-ఆర్బిట్ వాహనాన్ని అభివృద్ధి చేస్తుంది. టైటాన్స్ ఆర్బిటల్ పోర్ట్ స్పేస్ స్టేషన్ (టీఓపీఎస్), సెలిన్‌సిస్ -లూనార్ మిషన్, టైటానియ లూనార్ బేస్ ప్రణాళికలో ఉన్నాయి. జెన్‌సీస్ తొలి భూ-లూప్ ఆర్బిటల్ క్రూయిజ్-229లో జరగనుంది. ఆ తర్వాత క్రమ పద్ధతిలో ఆర్బిటల్, చంద్రయాత్రలు ప్రారంభమవుతాయి.

2026-27లో జరగనున్న బేసిక్ ట్రైనింగ్ ప్లాన్‌ను అంతరిక్ష నిపుణులు డాక్టర్ వ్లాదిమిర్ ప్లెట్సర్, డాక్టర్ మిండిహోవర్డ్, నాసా సీనియర్ వ్యోమగామి బిల్‌మెక్ ఆర్థర్ రూపకల్పన చేశారు. ఇందులో స్పేస్ క్రాఫ్ట్ సిస్టమ్, స్పేస్ మెడిసిన్, ఈవీఏ రెడీనెస్, ప్యారబాలిక్ ఫ్లైట్స్ ఐసీఈ (ఐసోలేటెడ్, కాన్ఫిన్డ్ ఎక్స్‌ట్రీమ్) పర్యావరణాలలో మానవ కారకాలపై మొత్తం 16 శిక్షణ విభాగాలు ఉండగా



టైటాన్స్ స్పేస్ ఆస్ట్రోనట్స్ అభ్యర్థి ఆకుల మోహన్‌సాయి

బేసిక్ ట్రైనింగ్ పూర్తిచేసిన అభ్యర్థులు 2028లో అడ్వాన్స్ ట్రైనింగ్, 2029లో మిషన్-స్పెసిఫిక్ ట్రైనింగ్ ద్వారా జెన్సిస్ ఫ్లైట్స్, దీర్ఘకాలిక స్పేస్‌స్టేషన్ మిషన్‌లకు సిద్ధం కానున్నారు.

అంతరిక్ష ప్రయాణంలో కీలక మలుపు

భారత్ తన మానవ అంతరిక్ష ప్రయాణంలో కీలక మలుపు దశలో ఉండగా అనుగామి అనలాగ్ మిషన్ విజయవంతం కావడం ద్వారా భారతదేశపు తొలి స్వదేశీ వ్యోమగామి ఎంపిక, సైకాలజీ ప్రొటోకాల్స్‌కు బలమైన ప్రమాణం లభించింది. అదే సమయంలో ప్రధానమంత్రి మోదీ ప్రకటించినట్లుగా త్వరలోనే భారత్‌కు సొంత స్పేస్‌స్టేషన్ రాబోతుంది. ఈ సందర్భంలో టైటాన్స్ స్పేస్ వంటి గ్లోబల్ భాగస్వాములు, భారత్ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు ప్రత్యక్ష వ్యోమగామి శిక్షణ పొందే అవకాశాలను కల్పిస్తున్నారు. కాగా మోహన్‌సాయి ఎంపిక భారత మానవ అంతరిక్ష రోడ్ మ్యాప్‌లో సివిలియన్ భాగస్వామ్యానికి ప్రతిబింబం మాత్రమే కాకుండా అంతర్జాతీయ సహకారాలు, భవిష్యత్ భారత వ్యోమగాములను సిద్ధం చేయడంలో ఎంత ముఖ్యమైనవో తెలియజేస్తుంది.

మోహన్‌సాయి ఎవరు?

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన ఆకుల మోహన్‌సాయి (అమర్) ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) మద్దతుతో నడిచే బెంగళూరులోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏరో స్పేస్ మెడిసిన్ (ఐఏఎం) లోని సెంటర్ ఫర్ అడ్వాన్స్ రీసెర్చ్ ఇన్ స్పేస్ సైకాలజీలో రీసెర్చ్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్నారు. మోహన్‌సాయి దేశం నుంచి ఆస్ట్రో బయాలజీ అండ్ స్పేస్ సైన్స్‌లో పట్టభద్రులలో మొదటితరానికి చెందిన వ్యక్తి కావడం గమనార్హం. మోహన్‌సాయి పరిశోధనలో చంద్రమట్టిని అనుకరించే లూనార్ సాయిల్ సిమ్యులెంట్స్‌లో మొక్కల సీడ్-టు-సీడ్ సైకిల్‌పై దృష్టి పెట్టారు. ఇది భవిష్యత్తులో లూనార్ బోటనీ, స్పేస్ ఫార్మింగ్‌కు మార్గం చూపుతుంది. పోలండ్ (యూరప్), అరిజోనా (యూఎ స్ఏ), లద్దాక్, రాజస్థాన్‌లలో జరిగిన అనేక అంతర్జాతీయ, జాతీయ అన్‌లాగ్ వ్యోమగామి మిషన్‌లలో పాల్గొని భారత్ తరపున ప్రాతినిధ్యం వహించారు. 2025 జూన్‌లో మోహన్‌సాయి భా రతదేశపు తొలి స్వదేశీ అన్‌లాగ్ వ్యోమగామి మిషన్ గగన్‌యాన్ అన్‌లాగ్ ఎక్స్‌పర్మెంట్-గైనెక్స్-1లో గగన్-3లో సేవలందించారు. ఇందులో ఒక ఇండియన్ వ్యోమగామి డిజిగ్నేట్ నేవీ ఫైటర్ పైలెట్‌తో కలిసి పనిచేశారు. ఈ మిషన్‌లో భారత తొలి వ్యోమగామి ఎంపిక, సైకాలజీ ప్రొటోకాల్స్‌ను విజయవంతంగా ధ్రువీకరించారు. మోహన్‌సాయి వ్యోమగామి శాస్త్రవేత్తలతో పాటు రుబారు అనే యువజన అభివృద్ధి సంస్థలో నాలుగున్నర సంవత్సరాలు పనిచేశారు. దేశ వ్యాప్తంగా 4,500 మందికి పైగా విద్యార్థులకు స్టెమ్ (స్పేస్ మిషన్)పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇవ న్నీ ఆయనను భారతదేశం 2035 స్పేస్ స్టేషన్, 2040 చంద్రమిషన్ లక్ష్యాలకు అనుగుణంగా నడిపిస్తున్నాయి.

భువనగిరి ఖిల్లా సందర్శనకు డిజిటల్ పేమెంట్

- టికెట్ కౌంటర్‌లో క్యూఆర్ కోడ్ ఏర్పాటుచేసిన పర్యాటకశాఖ



టికెట్ కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న సందర్శకులు

భువనగిరి టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక భువనగిరి ఖిల్లా సందర్శనకు టికెట్ చార్జీల చెల్లింపునకు పర్యాటకశాఖ డిజిటల్ పేమెంట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు క్యూఆర్ కోడ్ స్కానర్‌ను టికెట్ కౌంటర్‌లో ఏర్పాటు చేశారు ఇక నుంచి ఖిల్లా సందర్శనకు పర్యాటకులందరూ నిర్దేశిత చార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఇటీవల వరకు నగదు చెల్లింపుతో ఎదురైన ఇబ్బందులు పర్యాటకులకు తప్పనున్నాయి. అదే సమయంలో స్మార్ట్ ఫోన్ లేని పర్యాటకులకు కొత్త సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి.

ఖిల్లా సందర్శనకు 19 ఏళ్ల క్రితం టికెట్ విధా నం అమలులోకి వచ్చింది. మొదట్లో పెద్దలకు రూ.మూడు, పిల్లలకు ఒక్క రూపాయి మ్యానువల్ ప్రింటెడ్ టికెట్ ఇచ్చేవారు. 2009లో అదే చార్జీలతో టికెట్ కౌంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రింటర్ ద్వారా టికెట్ జారీ ప్రారంభమైంది. 2016లో టికెట్ చార్జీలను రూ.10కి పెంచుతూ విదేశీయులు, ఫొటో కెమెరా, వీడియో కెమెరాలను ప్రత్యేక చార్జీలను అమల్లోకి తెచ్చారు. తిరిగి జూన్ 2025 టికెట్ చార్జీలను మరోమారు సవరిస్తూ విదేశీయులకు అప్పటివరకు అమల్లో ఉన్న అదనపు చార్జీలను రద్దు చేశారు. ఈక్రమంలో అదే చార్జీలతో శుక్రవారం నుంచి సందర్శన టికెట్‌కు నగదు చెల్లింపును నిలిపివేస్తూ డిజిటల్ పేమెంట్‌ను అమల్లోకి తెచ్చారు. క్యూఆర్ కోడ్‌కు స్కాన్ చేసిన ప్రతి చెల్లింపు కొటక్ బ్యాంక్ హైదరాబాద్ బ్రాంచ్‌లోని తెలంగాణ హెరిటేజ్ ఖాతాలో జమవుతుంది. కాగా టికెట్ విధానం అమలులోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు భువనగిరి ఖిల్లా ద్వారా పర్యాటక శాఖకు సుమారు రూ. 1.30 కోట్ల ఆదాయం సమకూరిందని ఒక అంచనా. అయితే స్వదేశీ దర్శన్ 2.0 పథకంతో సుమారు రూ. 60 కోట్లతో ప్రతిపాదిత రోప్‌వే తదితర అభివృద్ధి పనులు పూర్తయితే ఖిల్లా సందర్శన టికెట్ల చార్జీలు, జారీ విధానంలో పెను మార్పులు వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

సేవా గుణమే శాశ్వతం

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సమాజసేవ చేసే గుణమే శాశ్వతమని, ఇది మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయేంత వరకు ఉంటుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలో శనివారం ఆర్కే, కామినేని ఆస్పత్రి, చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు, సిబ్బందికి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. 30 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ఉన్నందున ఈ శిబిరంలో ఎక్కువ సమయాన్ని కేటాయించలేకపోతున్నానని ఆయన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలతో పాటు అభివృద్ధి గురించి చర్చించాలని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే పదవి శాశ్వతం కాదని, అదే సమాజ సేవ చేసే గుణం, తపన మాత్రమే శాశ్వతంగా ఉంటాయని ఆయన అన్నారు. ఎమ్మెల్యే పదవి చెప్పుకునేందుకు ఉపయోగపడుతుంది తప్ప శాశ్వతం కాదని, అందరూ బాగుండాలన్న గుణం మాత్రం మనిషి మృతి చెందేంత వరకు ఉంటుందని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పదిమందికి పనికి వచ్చే పనులు చేస్తే తన సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. నియోజకవర్గంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మి ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు తనవంతు సహకారాన్ని అందిస్తున్నానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, తహసీల్దార్ బి. వీరాబాయి, ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, కాంగ్రెస్ మునుగోడు ఇన్‌చార్జి పబ్బు రాజుగౌడ్, మునిసిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మునిసిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రాంరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మునిసిపల్ ఆర్వో శ్రీధర్‌రెడ్డి, సీతారామచంద్రస్వామి ఆలయం చైర్మన్ బి.మురళి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుర్వి నర్సింహగౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్, మునిసిపల్ మాజీ కౌన్సిలర్ బొడిగే బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీవాగు



లీకేజీల వద్ద యువకుల సందడి

అర్వపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో కురుస్తున్న వర్షాలకు మూసీ నది నిండుకుండలా ఉంది. శనివారం మూసీ నదిని వందల సంఖ్యలో ప్రజలు తిలకించారు. మూసీ నది గేట్ల పక్కనే లీకేజీతో జలపాతం వలే కనిపిస్తుండటంతో సందర్శకులు సందడి చేశారు. లీకేజీ నీరు జలపాతం వలే ప్రవహిస్తోంది. అధికారులు ఈ లీకేజీని గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ లీకేజీ వద్ద సందర్శకులు స్నానాలు చేస్తున్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి రూ.100కోట్లు ఇవ్వాలి

- బస్వాపూర్ నీటిని నకిరేకల్‌కు తరలించాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, సామేలు, వీరేశం, అనిల్‌కుమార్‌రెడ్డి, అయిలయ్య, జైవీర్‌రెడ్డి

నార్కట్‌పల్లి, భువనగిరి కలెక్టరేట్, మిర్యాలగూడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లాలోని బస్వాపురం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసంతో పాటు పరిహారం కోసం రూ.100కోట్ల నిధులను కేటాయించాలని ఎమ్మెల్యేలు కోరారు. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. శనివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలిసి బస్వాపురం, లప్పనాయక్‌తండా, తిమ్మాపూర్ గ్రామాల్లోని నిర్వాసితులకు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ ఖచ్చితమైన అవసరంపై వివరించి తక్షణం రూ.100 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. నకిరేకల్ నియోజకవర్గంలోని రామన్నపేట, చిట్యాల మండలాల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని తరలించే పథకం తేవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే వేముల వీరేశం విజ్ఞప్తి చేశారు. బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకువస్తే పై రెండు మండలాల్లోని సుమారు 50వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. నియోజకవర్గంలో బీ.వెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు పురోగతిని వివరించారు. నిధులు కేటాయిస్తే ఇంకా చేయాల్సిన కాల్వల భూ సేకరణ వేగవంతమవుతుందని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. బీ.వెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు, అయిటిపాముల ఎత్తిపోతల పథకం, ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాల్వల పూర్తితో పాటు బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని తరలిస్తే భవిష్యత్తులో సాగునీటి సమస్య ఉండదని ముఖ్యమంత్రికి వివరించారు. నిధులు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి కలిసిన వారిలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేలు, నేనావత్ బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, ఎడమ బొజ్జ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

- ఈవోకు బాధితుల మొర



ప్రధాన కార్యాలయంలో డీఈవో దోర్బల భాస్కరశర్మకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు బూడిద ఐలయ్య, నాగరాజు, నర్సింహ

యాదగిరిగుట్ట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణంలో తమ జీవనోపాధి కోల్పోయిన తమకు ఉపాధి కల్పించాలని యాదగిరిగుట్ట మునిసిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లి దళితులు ఈవో ఎస్. వెంకట్రావుకు మొర పెట్టుకున్నారు. కొండపైన ప్ర ధాన కార్యాలయంలో శనివారం ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ కు వినతిపత్రం అందజేశారు. కొండకింద ఆధ్యాత్మిక వాడ ఏర్పాటుకు తమ పూర్వీకుల ద్వారా సంక్రమించిన వ్యవసాయ భూమిలో తక్కు వ పరిహారంతో గత ప్రభుత్వం సేకరించిందని నిర్వాసితులు బూడిద అయిలయ్య, నాగరాజు, నర్సింహ ఆవేదన వ్యక్తం చేశారు. యాదగిరిపల్లి రెవెన్యూ పరిధిలోని 63,75,76,114,115,116,117 సర్వే నంబరులో సుమారు 25 ఎకరాల వ్యవసాయ భూమిలో 32 మంది పట్టాదారులు ఉండగా సుమారు 350 మంది వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నట్లు తెలిపారు. స్థిరాస్తులు కోల్పోయినందున తమకు టెం డర్లు నిర్వహించకుండా వర్తక సంఘం తరపున దుకాణాలు, అర్హత ఉన్న యువతకు ఉద్యోగాలు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకం, దళితులం అయినందున స్వామివారి నిత్య కల్యాణంలో డప్పులు, కొట్టేందుకు, భక్తుల చెప్పులు భద్రపరించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అదేవిధంగా అసలైన భూనిర్వాసితులకు మడిగెల కేటాయింపు, వివిధ కారణాలతో దేవస్థాన పరిధిలో మృతి చెందిన మృతదేహాలను తరలించేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల సర్వీసు పొడగించవద్దు

బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉద్యోగ విరమణ పొందనున్న ఉద్యోగుల సర్వీసు పొడగించ వద్దని పార్టీ శ్రేణులు డీఈవో దోర్బల భాస్కరశర్మకు వినతిపత్రం అందజేశారు. ఇక్కడే పుట్టి, పెరిగి, చదువు, ఉద్యోగం వంటి వాటితో ఇక్కడే తిష్ట వేశారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం పొడగించిన సర్వీసు సరిపోదని, రిటైర్డ్ అయిన తర్వాత కూడా వారే వివిధ హోదాలో కొనసాగితే కింది స్థాయి ఉద్యోగులకు అవకాశాలు రాకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. వినతి అందజేసిన వారిలో దేవిపూజ అశోక్, వాసం రమేష్, బండి వాసు, పాండవుల భాస్కర్, ముక్కర్ల సతీష్, నర్సింగం పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సాగర్ 26 గేట్ల ద్వారా

కొనసాగుతున్న నీటి విడుదల



నాగార్జునసాగర్ ప్రాజెక్టు 26 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి శనివారం 26 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల కొనసాగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 586.70అడుగులుగా (303.9495టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 8,529 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 4,881 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,373 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కులు, 26 క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 2,01,604 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 2,50,487క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 2,50,487 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి కొనసాగుతున్న వరద ఉధృతి

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టు వరద నీటి ఉధృతి కొనసాగుతోంది. నాలుగైదు రోజులుగా ఎగువ నుంచి వచ్చే వరద నీటితో పొంగిపొర్లిన మూసీ ప్రాజెక్టు శనివారం కొంత శాంతించింది. శనివారం సాయంత్రానికి కొంత తగ్గుముఖం పట్టి 8815.90 క్యూసెక్కులుగా నమోదైంది. మరోవైపు ప్రాజెక్టు 643.60 అడుగుల గరిష్ఠస్థాయిలో ఉంచుతూ అధికారులు ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లోకు అనుగుణంగా 8 క్రస్టుగేట్ల ద్వారా 8519.38 క్యూసెక్కుల వరద నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 643.60 అడుగులు(4.09టీఎంసీలు)గా ఉంది. ప్రాజెక్టు ఆయకట్టుకు కుడి, ఎడమకాల్వల ద్వారా 236.30 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది.

గణేశుడి లడ్డూ దక్కించుకున్న ముస్లిం



సోనుసోయల్‌కు లడ్డూ అందజేస్తున్న నిర్వాహకులు

చిట్యాల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చిట్యాలలోని గ్రీన్‌గ్రోవ్ పాఠశాలలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద శనివారం నిర్వహించిన లడ్డూ వేలంపాటలో పాఠశాల విద్యార్థి సోనుసోయల్ తండ్రి ఎండీ అజీమ్ రూ.6516లకు దక్కించుకున్నాడు. వేలంపాటలో లడ్డూ దక్కించుకుని మత సామరస్యాన్ని చాటిన అజీమ్‌ను పలువురు అభినందించారు. పలు వినాయక మండపాల వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు. జూనియర్ ఫ్రెండ్స్ యూత్ నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు బొబ్బల రాంరెడ్డి, మేకల శివ, చొల్లేటి ఉమాశంకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రాస్తారోకో



శాలిగౌరారంలో యూరియా కోసం ధర్నా చేస్తున్న రైతులు

శాలిగౌరారం: సకాలంలో యూరియా అందక తాము తీవ్ర అవస్థలు పడుతున్నామని వెంటనే యూరియా పంపిణీ చేయాలని శాలిగౌరారం రైతులు ధర్నా నిర్వహించారు. శాలిగౌరారం అంబేడ్కర్ చౌరస్తా నకిరేకల్ - గురజాల ప్రధాన రహదారిపై వద్ద దాదాపు గంట పాటు వివిధ గ్రామాల రైతులు ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ యూరియా కొరత వల్ల తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత అధికారులు వ్యవసాయం విస్తీర్ణంలో అధికంగా ఉన్న శాలిగౌరారం మండలానికి సరిపోను యూరియా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి రైతులకు నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.

యూరియా కోసం రైతుల అవస్థలు

- చెప్పులు, ఆధార్‌కార్డులను వరసలో ఉంచిన రైతులు
- తెల్లవారుజాము నుంచే బారులు తీరుతున్న రైతులు

ఆత్మకూర్(ఎస్), మునగాలరూరల్, పాలకవీడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్ పీఏసీఎస్ కేంద్రానికి శనివారం రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నెమ్మికల్ పీఏసీఎస్ కేంద్రానికి 222, నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీకి మరో 222 బస్తాలు రావడంతో రైతులు యూరియా కోసం బారులు తీరారు. తెల్లవారుజాము నుంచే రైతులు చెప్పులు, ఆధార్‌కార్డులు, తమ వెంట తెచ్చుకున్న సంచులను క్యూలైన్‌లో పెట్టారు. వచ్చిన 444 బస్తాల యూరియా ఒక గంటలోనే పంపిణీ చేయడంతో అక్కడికి చేరుకున్న రైతుల్లో కనీసం ఐదుశాతం మందికి కూడా అందకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. సెప్టెంబరు 3వ తేదీన యూరియా వ్యాగన్ వస్తుందని రైతులకు సకాలంలో యూరియా అందిస్తామని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా మునగాల మండలంలోని తాడ్వాయి సొసైటీ ఎదుట రైతులు ఆందోళన చేశా రు. తుంగతుర్తి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిలపక్షం ఆధ్వర్యంలో అధికారులను కార్యాలయంలోకి వెళ్లకుండా ధర్నా నిర్వహించారు. వచ్చే నెల 3తేదీ వరకు యూరియా వస్తుందని అప్పటి వరకు రైతులు ఓపిక పట్టాలని తహసీల్దార్ సూచించడంతో రై తులు ధర్నా విరమించారు. పాలకవీడు మండల కేంద్రంలోని పీఏసీఎ స్ ఎదుట క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడ్డారు. ఎకరాకు ఒక యూరియా బస్తా కూడా అందకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మునగాలలో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సుంకర అజయ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, పీఏసీఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, కోల ఆంజనేయులు, తుంగతుర్తిలో అఖిలపక్షం నాయకులు తాటికొండ సీతయ్య, గుండగాని రాములు, గాజుల మహేందర్, కోట లింగస్వామి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్ వద్ద క్యూలో నిలబడిన రైతులు



మునగాల: తాడ్వాయి సొసైటీ ఎదుట గుమిగూడిన రైతులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండటౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏడీఈ ఎం.వేణుగోపాలాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11నుంచి 12.30 గంటల వరకు పానగల్, శ్రీనగర్, లెప్రసీ, ఎఫ్‌సీఐ, దత్తసాయి కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు రాఘవేంద్రకాలనీ, హనుమాన్‌నగర్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

కేబుల్ వైర్లను తొలగించవద్దు

నల్లగొండ రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలకు ఉన్న ఇంటర్ నెట్ కేబుల్ వైర్లను తొలగించవద్దని నెట్, కేబుల్ ఆపరేటర్లు కోరారు. శనివారం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకస్మాత్తుగా నెట్ కేబుల్ వైర్లను తొలగించడం వల్ల ఇంటర్నెట్ పాటు నెట్ కేబుల్ ఆపరేటర్లకు ఉపాధి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఓటరు జాబితా పారదర్శకంగా తయారుచేయాలి

నార్కట్‌పల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేయాలని ఎంపీడీవో ఉమేష్‌చారి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక సంస్థలకు సంబంధించి విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాపై శనివారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులు కూడా ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేసేందుకు సహకరించాలని కోరారు. ఓటరు జా బితాలో తప్పులను సవరించాలని, ఒక ఇంటిలో ఓటు హక్కు ఉన్న కుటుంబ సభ్యులందరూ ఒకే వార్డులో ఉండేలా తప్పులు సరిచేయాలని, చనిపోయిన వారి పేర్లు కూ డా జాబితాలో ఉన్నందున వాటిపై డెత్ అని ముద్రవేస్తామని ఎంపీడీవో పేర్కొన్నా రు. ఈ సమావేశంలో ఎంపీవో సుధాకర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు బత్తు ల ఊశయ్య, మేడబోయిన శ్రీనివాస్, దుబ్బాక శ్రీధర్, నడింపల్లి శ్రవణ్‌కుమార్, భాషపాక రవికుమార్, కొంపల్లి సైదులు, ఉయ్యాల శ్రవణ్ కుమార్, బిల్లకంటి శ్రీకాంత్, కర్నాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


నార్కట్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

శాలిగౌరారం: స్థానిక సంస్థల ఎన్నికల డ్రాఫ్ట్ పోలింగ్‌స్టేషన్లు, ఓటర్ల జాబితాపై అన్ని రాజకీయ పార్టీల సమావేశం శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి సమక్షంలో వివిధ పార్టీ నాయకుల అభిప్రాయాలను వెలిబుచ్చారు.

ఓటర్ల జాబితాలో తప్పులు సరిచేయాలి : సైదులు


సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘం నేత సైదులు

నల్లగొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): తాజాగా రూపొందించిన గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాల్లో తప్పులను ఎన్నికల సంఘం సవరించాలని దళిత సంఘం నేత గోలి సైదులు డిమాండ్ చేశారు. నల్లగొండలోని జడ్పీ విశ్రాంతిగృహం వద్ద శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యంతరాల సమర్పణకు గడువు పొడగించాలని డిమాండ్ చేశారు. పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాల తయారీలో పలుచోట్ల పంచాయతీ కార్యదర్శులపై ఆరోపణలు వచ్చినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. పంచాయతీ కార్యదర్శులు వారికి బదులు ఫీల్డ్ అసిస్టెంట్లు, కారోబార్లతో ఓటర్ల సవరణ చేయించారని, దీంతో గ్రామాల్లో రాజకీయ నాయకుల ప్రోద్బలంతో జాబితాల్లో తప్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఓటర్ల జాబితాల్లో చనిపోయిన వ్యక్తుల పేర్లు చేర్చారని, ఓపెన్ ప్లాట్ల సర్వే నెంబర్ల చిరునామాలతో పలు ఓట్లు చేర్చారని ఆరోపించారు. ఒక ఇంటిమీద 15 మందికి ఓట్లు ఇచ్చారని, ఒక ఫార్మ్‌హౌజ్‌లో 80మందికి ఓట్లు ఇచ్చారని ఆరోపించారు. వివాహమై అత్తవారింటికి వెళ్లిన మహిళల ఓట్లు పుట్టింటి వద్ద అలాగే కొనసాగిస్తున్నారని వీటన్నింటినీ పరిశీలించి, సవరించే నిమిత్తం అభ్యంతరాల నమోదుకు గడువును పెంచాలని కోరుతున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా దీర్ఘకాలంగా ఒకేచోట పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను మార్చాలని, పంచాయతీరాజ్ చట్టానికి విరుద్ధంగా సొంత మండలాల్లో పనిచేసే కార్యదర్శులను తక్షణం బదిలీ చేయాలని కోరారు. ఏడాది కాలంగా పంచాయతీ కార్యదర్శులపై ఎలాంటి ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకోవడం లేదని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో చేతివాటం ప్రదర్శిస్తున్న చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు తెలగమళ్ల యాదగిరి, విజయ్‌కుమార్, రవికిషన్, యాదయ్య పాల్గొన్నారు.

పెద్దచెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేయాలి


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నార్కట్‌పల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పెద్ద చెరువు వద్ద వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ఎంపీడీవో ఉమేష్‌చారికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చెరువులో నీరు ఉన్నప్పుడు వినాయక విగ్రహాల నిమజ్జనంతో పాటు సద్దుల బతుకమ్మను నిర్వహించేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉదయసముద్రం నీటి రాకతో చెరువులో పుష్కలంగా నీరు చేరినందున క్రేన్లు, బారికేడ్లు అందుబాటులో ఉంచి భద్రతాపరంగా నిమజ్జన ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు నడింపల్లి శ్రవణ్‌కుమార్, నాయకులు బిక్కంటి గణేష్, రామలింగం పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌కు ఏకలవ్య విద్యార్థుల ఎంపిక


మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు ఎంపికైన విద్యార్థులు

నల్లగొండటౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన అసోసియేషన్ ఆఫ్ మాథమేటి క్స్ టీచర్స్ ఆఫ్ ఇండియా (ఏఎంటీఐ) చెన్నై నిర్వహించే జాతీయస్థాయి మ్యాథ్స్ ఒలంపియాడ్- 2025లో జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌కు చెందిన ఏకలవ్య ఫౌండేషన్ స్కూల్ విద్యార్థులు ఫస్ట్ లెవెల్‌లో ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు పి. సాన్వి, పి.రిత్విక్, జి.ప్రీతమ్, స్వరూప్ ప్రైమరీ లెవల్‌లో, ఆర్.యశ్వంత్, డి. ప్రనీద్‌రెడ్డి, జి.రుతిక, యం.అమన్‌సాయిరెడ్డి సబ్‌జూనియర్ లెవల్, జె.రోహిత్, యం. అభివర్ధన్‌రెడ్డి, జె.జిగ్నేష్, శ్రీబన్సాల్ జూనియర్ లెవల్‌లో అర్హత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైమరీ లెవల్ నుంచి మ్యాథ్స్ బేసిక్స్‌పై పట్టు సాధించి విద్యార్థుల్లో సెల్ఫ్ లెర్నింగ్‌ను ఇంప్రూవ్ చేయడం ద్వారా ఈ ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను సహకరించిన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను పాఠశాల చైర్మన్ అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ మారం శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. వాణి అభినందించారు.

ఆలయానికి మైక్‌సెట్ బహూకరణ

మునుగోడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మునుగోడు శ్రీ మార్కండేయ ఆలయానికి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త పాలకూరి నరిసంహగౌడ్ రూ.50వేల విలువైన యాంప్లిఫైర్, సౌండ్ సిస్టమ్ బాక్సుల మైక్‌సెట్ శనివారం బహూకరించి తన దైవభక్తి చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ నిర్వాహకులు జ్ఞాపికను అందజేసి శాలువాతో సత్కరించారు. ముందుగా ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

శాలిగౌరారం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బెల్లి వీరభద్రం అన్నారు. మండలంలోని వంగమర్తి గ్రామానికి చెందిన రూపని మహేందర్‌కు మంజూరైన రూ..60వేల విలువైన చెక్కును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండె కిషోర్, పోయిలపాక సురేష్, బాసాని నాగయ్య, పొయిలపాక దాసు, శ్రీను, అరుణ్, విజయ్, ప్రవీణ్, అబ్రహం పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చటంలో కాంగ్రెస్ విఫలం

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన

మునుగోడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇ చ్చిన హామీలను నెరవేర్చటంలో విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్యయాదవ్, మండల ఇన్‌చార్జి కాసాల జనార్ధన్‌రెడ్డి విమర్శించారు. గ్రామాల్లో నెలకొన్న మౌలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్ కార్యాలయం ఎదుట ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో కొద్దినెలలుగా ఇన్‌చార్జీల పాలనలో ఎక్కడి సమస్యలు అక్కడే నెలకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల హామీలు అమలు చేసి, ప్రజాసమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ నేలపట్ల నరేష్‌ను కలిసి విన్నవించి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మునుగోడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

భూఆక్రమణపై విచారణ

చిట్యాల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీ పరిధి సర్వే నెంబర్ 59లో కొంతమంది వ్యక్తులు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించారని వచ్చిన సమాచారం మేరకు శనివారం గిర్దవార్ జానీ షరీఫ్ అట్టి భూమి వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. నూతి సైదులు అనే వ్యక్తి భూమిని చదును చేసినట్లు తెలియగా అతనిని తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి విచారణ చేసినట్లు తహసీల్దార్ కృష్ణనాయక్ తెలిపారు. తన పొలంలోకి వెళ్లడం కోసం భూమిని చదును చేసినట్లు విచారణలో సైదులు వెల్లడించారని ఆయన తెలిపారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి


ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

నల్లగొండరూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అర్హులైన వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళలకు పింఛన్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కంచనపల్లి గ్రామంలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్నవారికి ప్రొసీడింగ్స్ ఇచ్చి, నిధులు లేవన్న సాకుతో పింఛన్లు ఆపివేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. సమస్యలు పరిష్కరించాలని సెప్టెంబరు 1న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నలుపరాజు సైదులు, సత్యనారాయణ, భారతమ్మ, లక్ష్మమ్మ, పూలమ్మ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు 1వ తేదీన మునిసిపల్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై ఆగస్టు 1 నుంచి జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లోని వివిధ వార్డుల్లో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వేలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సర్వేలో తెలుసుకున్న సమస్యలను అధికారులకు విన్నవించనున్నట్లు పేర్కొన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

మునుగోడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మునుగోడు క్యాంపు కార్యాలయంలో వినాయకుడికి నిర్వహించిన పత్ర్యేక పూజల్లో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల నాయకులు భీమనపల్లి సైదులు, ఆరేల్ల సైదులు, జంగిలి నాగరాజు, వెంకన్న ఉన్నారు.


వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నేచర్ స్మార్ట్ సిటీలో గణేశునికి ప్రత్యేక పూజలు

నల్లగొండటౌన్: నల్లగొండ పట్టణంలోని నేచర్ స్మార్ట్‌సిటీలో నెలకొల్పిన గణనాథుడి వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరందాస్ సైదుబాబు కుటుంబ సభ్యులు, ఎమిరెడ్డి నర్సిరెడ్డి, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పానగల్ ఒకటో వార్డులో....

పానగల్ ఒకటో వార్డులో ఆలకుంట్ల శివ ఆధ్వర్యంలో శనివారం పానగల్ ఒకటో వార్డులో వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ, ఆయురారోగ్యాలతో, సుఖ, సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలకుంట్ల శ్రీరాజ్, ఆలకుంట్ల వెంకన్న, ఓర్సు శివ, ఆలకుంట్ల వెంకన్న, గుండగోని పాపయ్య, ఆలకుంట్ల నాగరాజు, గండికోట సాయి, కుంచం నాగరాజు, శివ, బొంత విజయ్, ఓర్సు వెంకన్న, ఉదయ్, సాయి, పార్థు తదితరులు పాల్గొన్నారు.


నేచర్ స్మార్ట్ సిటీలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


పానగల్ ఒకటవ వార్డు పూజల్లో పాల్గొన్న భక్తులు

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే సర్వే


శేర్‌గూడెంలో సర్వే చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీశైలం

గట్టుప్పల్, ఆ గస్టు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని లక్ష్యంతో సీపీఎం ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. మండలంలోని శేర్‌గూడెం, కమ్మగూడెం గ్రామాల్లో శనివారం ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామస్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శేర్‌గూడెం నుంచి నేర్మట, నామ్నాపురం, తెరటిపల్లి, మద్దివారిగూడెం గ్రామాలకు లింకురోడ్లు ఏర్పాటు చేసి రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. శేర్‌గూడెం బజార్లకు సీసీరోడ్లు, మెయిన్ రోడ్డుకు ఇరువైపులా మురికికాల్వల నిర్మాణం, ఆరు బజార్లకు డ్రైనేజీలు, అన్ని స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వల్లూరి శ్రీశైలం, పబ్బు మారయ్య, మాలిగా శివ, మల్లమ్మ, ఎల్ల య్య, కృష్ణయ్య, మద్ది నరసింహ, యాదమ్మ, ప్రశాంత్, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

గట్టుప్పల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి బడుగు లక్ష్మయ్య, మండల అధ్యక్షుడు గడ్డం కృష్ణయ్య, అడహక్ కమిటీ సభ్యుడు ఎండీ షరీఫ్ అన్నారు. గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి గ్రామంలో టీడీపీ జెండాను వారు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో సభ్యత్వం కార్యక్రమంలో మునుగోడు రెండో స్థానంలో ఉందన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఎండీ పాష, ఉపాధ్యక్షుడు పట్టిగాలా అంజయ్య అన్ని గ్రామ శాఖల అధ్యక్షులు గుర్రం కొండయ్య, బోళ్ల శ్రీకాంత్, కంపే శ్రీశైలం, గ్రామ కార్యదర్శులు కంపే రాములు, పెద్దగాని రాములు, చౌటుప్పల్ మునిసిపల్ అధ్యక్షుడు సుంకరి జంగయ్య, నాయకులు తడక కోటేశ్వర్, వేట వెంకటేశం, శ్రీపతి రాంరెడ్డి, కొలను వేణుగోపాల్‌రెడ్డి, మునుగోడు మండల అధ్యక్షుడు వీరమళ్ల అశోక్, పందుల రాములు, బొడ్డుపల్లి సత్తయ్య, బడంగి సత్తయ్య, రాజు, సత్తయ్య పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

మునుగోడు రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 1న పింఛన్ విద్రోహదినంగా నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నరసింహ కోరారు. శనివారం పలివెల జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ధర్నా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తాటి శ్రీనివాస్, ఉపాధ్యాయుల లక్ష్మీనరసయ్య, వెంకటేశ్వర్లు, విలియం రాజు, బాలరాజు, లింగమ్మ, వెంకన్న, రాఘవేందర్, మహేష్, కవిత, సావిత్రి, ప్రవళిక, యూటీఎఫ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హార్టికల్చర్ యూనివర్సిటీని మంజూరు చేయాలి

కనగల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు హార్టికల్చర్ యూనివర్సిటీని మంజూరు చేయాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి జగాల్‌రెడ్డి కోరారు. నల్లగొండలో బత్తాయి రైతుల సమావేశానికి హాజరైన రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి జగాల్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు పత్తి మిల్లులు, ఫామాయిల్ ఫ్యాక్టరీలను నెలకొల్పాలని అన్నారు. ప్రభుత్వం రైతు వేదికల వద్ద ఫర్టిలైజర్ షాపులను ప్రారంభించి రైతులకు నాణ్యమైన మందులను సరఫరా చేయాలన్నారు. నకిలీ మందులు, విత్తనాల నుంచి రైతులను కాపాడాలన్నారు. బత్తాయి రైతులకు క్రమం తప్పకుండా శిక్షణ తరగతులను నిర్వహించాలన్నా రు. దిగుబడుల పెంచేందుకు తగు సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. సబ్సిడీ వ్యవసాయ యంత్రాలను పంపుసెట్లను రైతులకు అందించి ప్రోత్సహించాలన్నారు. పంట పొలాలకు ఉపాధి నిధులతో దారులను నిర్మించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ హాఫీజుద్దీన్, కేసాని వెంకట్‌రెడ్డి, వేమిరెడ్డి దిలీప్‌రెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.


కోదండరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న గోలి జగాల్‌రెడ్డి

'రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి'

మర్రిగూడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు బండి హనుమంత్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే మునుగోడు నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని అన్నారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. నాంపల్లి, మర్రిగూడ మండలాలలోని రెండు రిజర్వాయర్లు పూర్తి చేస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు కారింగి నరసింహగౌడ్, భీమనగొని రేవంత్‌యాదవ్, నర్సింహ, రాములు, వెంకటయ్య, మల్లయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


అసెంబ్లీకి వెళ్లను !

(5వ పేజీ తరువాయి)

మండలంలో జరిగిన కార్యక్రమంలో పదవులే కాదు పైసలు కూడా ఇవ్వడం లేదని వాపోయారు. తమ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణాలకు నిధులివ్వడం లేదని, దీంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతోందని వివరించారు. తాజాగా, శుక్రవారం చౌటుప్పల్‌లో తన క్యాంపు కార్యాలయం వద్ద అక్కడకు వచ్చిన ట్రిపుల్‌ఆర్ నిర్వాసితుల సమస్యలు విని ఆర్డీవోకు ఫోన్‌చేసి భూసేకరణపై తాను సీఎంతో మాట్లాడతానని, రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని, నోటీసు ఇచ్చే ప్రక్రియను కొంతకాలం నిలపాలని సూచించారు. తాజాగా, శనివారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మరోసారి హైదరాబాద్ కేంద్రంగా ఈ సమావేశాల్లో తాను అసెంబ్లీకి వెళ్లేది లేదని, వరద సహాయక చర్యల్లో పాల్గొంటానని ప్రకటించారు. మొత్తంగా కాంగ్రెస్ అధిష్ఠానంపై రాజగోపాల్‌రెడ్డిలో నెలకొన్న అసంతృప్తి, అసహనం ఎటువైపు దారి తీస్తుందోననే ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది.

నియోజకవర్గంలో ఆయన ప్రత్యర్థులు సైతం రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపై ప్రేమతప్ప నియోజకవర్గ అభివృద్ధి గురించి ధ్యాస లేదంటూ వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారు. దీంతో రాజగోపాల్‌రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోననే ఆసక్తి చర్చ సాగుతోంది.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 21.4
***
ANDHRAJYOTHY



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.70 (303.9495)	2,50,487	2,50,487
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.60 (4.09)	8815.90	8815.90
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.798 (39.5040)	2,39,000	2,14,059

చికెన్ ధరలు	లైవ్ : రూ.120	డ్రెస్ : రూ.170	స్కిన్‌లెస్ : రూ.200

అసెంబ్లీకి వెళ్లను!

- వరద సహాయక చర్యల్లో పాల్గొంటా
- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కీలక నిర్ణయం
- మంత్రివర్గ విస్తరణ తర్వాత ప్రభుత్వంపై విరుచుకుపడతానన్న ఎమ్మెల్యే
- తరచూ నిలదీస్తూ గళమెత్తుతున్న రాజగోపాల్
- ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారోననే ఆసక్తి



యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో ఓ కార్యక్రమంలో మాట్లాడుతున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): అధికార పార్టీలో ప్రతిపక్షనేతలా వ్యవహరిస్తూ రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేకత చాటుతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి ఆసక్తికర నిర్ణయాన్ని వెల్లడించారు. తాజాగా, మొదలైన అసెంబ్లీ సమావేశాల్లో తొలిరోజు మినహా మిగిలిన రోజుల్లో తాను పాల్గొనేది లేదని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని కుదిపేసిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగుబాటుపై జస్టిస్ పీసీ.ఘోష్ నివేదికపై చర్చ, స్థానిక సంస్థల ఎన్నికల వంటి కీలకమైన ఎజెండాతో జరగనున్న ఈ అసెంబ్లీ సమావేశాలపై అందరి దృష్టి నెలకొంది. ఈ సందర్భంలో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఈ సమావేశాలకు దూరంగా ఉండనున్నట్టు ప్రకటించడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

అసెంబ్లీ సమావేశాలు శనివారం మొదలవుతున్న సందర్భంలో అసెంబ్లీకి ఎదురుగా ఉన్న గన్‌పార్క్‌వద్దకు పెద్ద సంఖ్యలో మద్దతుదారులు, అనుచరులతో కలిసి వచ్చిన రాజగోపాల్‌రెడ్డి అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేయడం కలకలం సృష్టించింది. భారీ వర్షాలతో కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని, వారిని ఆదుకోవడమే తనకు ముఖ్యమని పేర్కొన్నారు. ఆదివారం నుంచి వరద సహాయక చర్యల్లో తన అనుచరులతో కలిసి పాల్గొంటానని స్పష్టం చేశారు. ప్రజలు వరద కష్టాల్లో ఉన్నప్పుడు తాను అసెంబ్లీలో ఉండడం సరి కాదని అభిప్రాయపడ్డారు. మంత్రి పదవిపై స్పందిస్తూ పదవులు ఎవ్వరికీ శాశ్వతం కాదని, మంచి వ్యక్తిత్వం, సేవ చేసే గుణమే శాశ్వతమని పేర్కొన్నారు. పదవులు శాశ్వతంగా కొనసాగవని, మంచితనం, సేవాగుణం శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. ఎమ్మెల్యేగా కాకుండా ఒక వ్యక్తిగా వరద సహాయకచర్యల్లో పాల్గొం...ుజ్బాజుజ్బుజ్బు నని వివరించారు.

మంత్రివర్గ విస్తరణ తరువాత గళమెత్తుతున్న రాజగోపాల్‌రెడ్డి

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏర్పాటైన మంత్రివర్గంలో, ఆతర్వాత జూన్‌లో జరిగిన మంత్రివర్గ విస్తరణలో సైతం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి దక్కలేదు. మంత్రివర్గ విస్తరణ వరకు ఎలాంటి రాజకీయ విమర్శలు, వ్యాఖ్యలు చేయకుండా సైలెంట్‌గా ఉన్న రాజగోపాల్‌రెడ్డి, ఆ తరువాత తన గళాన్ని పెంచారు. పలు సమస్యలపై, రాజకీయ అంశాలపై తనదైన శైలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తుండడం చర్చనీయాంశంగా మారింది. తనకు మంత్రి పదవి రాకపోవడానికి కారణాలను ఒక్కో సందర్భంలో బహిరంగపరుస్తూ రాజకీయాల్లో చర్చకు తెరతీశారు. మాజీమంత్రి జానారెడ్డి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని లేఖరాయడం ద్వారా తన అవకాశాలకు గండి పడిందని భావించిన రాజగోపాల్‌రెడ్డి చౌటుప్పల్‌లో ఏప్రిల్‌లో జరిగిన మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకార సభలో జానారెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆతర్వాత కొంతకాలం స్తబ్దుగా ఉన్నా, మంత్రివర్గ విస్తరణ తర్వాత మళ్లీ ఎక్స్‌లో ట్వీట్లతో, నియోజకవర్గంలో కార్యక్రమాల్లో తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ వచ్చారు. సోషల్‌మీడియాపై సీఎం వ్యాఖ్యలను ఖండించడం, తనకంటే జూనియర్లకు పదవులిస్తున్నారని వ్యాఖ్యానించడం, ఎల్‌బీనగర్‌లో పోటీచేస్తే మంత్రిపదవి ఇచ్చేవారని, కానీ తానే మునుగోడు అభివృద్ధి కోసం ఇక్కడ పోటీచేశానని వ్యాఖ్యానించడం, మహబూబ్‌నగర్‌కు సీఎం పదవి, ఖమ్మం జిల్లాకు మూడు మంత్రిపదవులు ఇవ్వగా లేనిది నల్లగొండ జిల్లాకు మూడు పదవులిస్తే తప్పేంటని ప్రశ్నించడం ద్వారా చర్చకు తెరలేపారు. దీనికి కొనసాగింపుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఒక మీడియా ప్రకటనలో మంత్రి పదవి విషయంలో రాజగోపాల్‌రెడ్డికి అధిష్ఠానం మాట ఇచ్చింది వాస్తవమేనని, సమీకరణాలు కుదరక ఇవ్వలేకపోయారని పేర్కొనడంతో రాజగోపాల్ వాదనకు బలం చేకూర్చినట్లయింది. అనంతరం ఏ సమీకరణాలు ఎందుకు కుదరడం లేదని, తామిద్దరం అన్నదమ్ములం అనే విషయం మాట ఇచ్చినప్పుడు తెలియదా? అని రాజగోపాల్‌రెడ్డి అధిష్ఠానాన్ని మరోసారి నిలదీశారు. మరో సందర్భంలో రాజగోపాల్‌రెడ్డి సంస్థాన్ నారాయణపురం

మిగతా 8వ పేజీలో...



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

బత్తాయిని కాపాడేందుకు ప్రభుత్వానికి సూచనలు చేస్తాం

● రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

నల్లగొండ (కలెక్టరేట్), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బత్తాయి పంటను కాపాడేందుకు ప్రభుత్వానికి సూచనలు చేస్తామని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. కమిషన్ రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో బత్తాయి రైతులు, ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిడమనూరు మండలంలో బత్తాయి తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడామన్నారు. జిల్లా కేంద్రం సమీపంలోని బత్తాయి మార్కెట్‌ను సందర్శించి రైతుల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నామన్నారు. వీటిని క్రోడీకరించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. భవిష్యత్తులో బత్తాయి పంటను కాపాడేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. బత్తాయి మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత మార్కెటింగ్‌శాఖపై ఉందన్నారు. ప్రైవేట్ మార్కెట్‌ను ప్రభుత్వ మార్కెట్‌తో అనుసంధానం చేయాలన్నారు. సంప్రదాయ పంటగా ఉన్న బత్తాయిని నిర్లక్ష్యం చేస్తే రానున్న కాలంలో తోటలు కనపడకుండా పోతాయన్నారు. రైతు ఉత్పత్తి సంఘాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, వ్యవసాయ కమిషన్ ఆదేశాల మేరకు బత్తాయి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. రైతుల సూచన మేరకు బత్తాయి కాయలను పాఠశాలలు, హాస్టళ్లకు పంపిణీ చేసే విషయమై నివేదిస్తామన్నారు. సమావేశంలో వ్యవసాయ అధికారి శ్రవణ్, మార్కెటింగ్‌శాఖ అధికారి ఛాయాదేవి, వ్యవసాయ కమిషన్ ఓఎస్డీ గోపాల్, ఆర్డీవోలు అశోక్‌రెడ్డి, రమణారెడ్డి, ఉద్యానశాఖ అధికారి అనంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

దేవరకొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే కుక్కల బారిన పడకుండా ఉంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం దేవరకొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఎక్కడబడితే అక్కడ చెత్త వేయడం వల్ల కుక్కలు, కోతుల సమస్య పెరుగుతోందన్నారు. వీధి, పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని జిల్లాలో మొదటిసారిగా దేవరకొండ నుంచే ప్రారంభించినట్లు తెలిపారు. మున్సిపల్‌శాఖ అధికారులు పట్టణంలో కుక్కల సంరక్షకులతో సమావేశం ఏర్పాటు చేసి రోడ్లపై వాటిని వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కల యజమానులను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో డానియెల్, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ విద్య కోసం పోరాటం: ఏఐఎస్ఎఫ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

హాలియా, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అందరికీ విద్య కోసం ఏఐఎస్ఎఫ్ పోరాడుతోందని సంఘం జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం హాలియాలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్రోద్యమంలో ఏఐఎస్ఎఫ్ అసమాన పోరాటాలు నిర్వహించిందన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. పెండింగ్‌లో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ నాయకులు కొర్ర రమేష్, రమావత్ శ్రీధర్, వంశీ, నరేష్, రాజు, మౌనిక, అలేఖ్య, గంగా, గణపతి, రాజేశ్వరి, మల్లేశ్వరి, మహేష్, పాల్గొన్నారు.

31 పీఏసీఎస్‌లకు స్పెషలాఫీసర్లు?

- ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన అధికారులు
- మిగిలిన పీఏసీఎస్‌ల బాధ్యతలు చైర్మన్లకు
- అధికారుల నివేదిక వివాదాస్పదమయ్యే అవకాశం



నల్లగొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): డిఫాల్ట్‌గా మారిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలపై చర్యలు చేపట్టాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం రాజకీయ దుమారానికి తెరతీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. సహకార సంఘాల ఎన్నికలు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగాయి. ఆ ఎన్నికల్లో అత్యధికంగా ఆ పార్టీ నేతలు సహకార సంఘాల డైరెక్టర్లుగా, పీఏసీఎస్ చైర్మన్లుగా ఎన్నికయ్యారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత ఆయా నియోజకవర్గాలలో రాజకీయ అవసరాలకు అనుగుణంగా పలువురు చైర్మన్లు, డైరెక్టర్లు పార్టీ మారారు. ఇదిలా ఉండగా, పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రభుత్వం ఈనెల 14న గడువును పెంచుతూ జీవో జారీ చేసింది. అయితే అనూహ్యంగా పాలకవర్గాల గడువును నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. పీఏసీఎస్ చైర్మన్లకు బాధ్యతలు ఇవ్వకుండా డీసీవోలకు ఆదేశాలు జారీచేయడంతోపాటు చెక్ పవర్‌ను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే రాష్ట్రంలోని తొమ్మిది ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ల బాధ్యతలను యథావిధిగా కొనసాగిస్తూ, వారి సొసైటీల పాలకవర్గాలను మాత్రం కొనసాగేలా ఆదేశాలు ఇచ్చింది. ఉమ్మడి నల్లగొండ డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వ ఆదేశాల మేరకు బాధ్యతలు నిర్వహిస్తుండగా, పాలకవర్గంలోని సుమారు 19మంది డైరెక్టర్లు మాజీలుగా మిగిలారు.

31 సొసైటీల్లో స్పెషలాఫీసర్ల పాలన

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 108 ప్రాథమిక సహకార సంఘాలు ఉండగా, అందులో 31 ప్రాథమిక సహకార సంఘాలకు త్వరలో స్పెషలాఫీసర్లను నియమించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. అందుకు సంబంధించి మూడు జిల్లాలకు చెందిన డీసీవోలు ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం మేరకు నల్లగొండ జిల్లాలో 10 పీఏసీఎస్‌లకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తారని చర్చ సాగుతుండగా, సూర్యాపేట జిల్లాలో 12 సొసైటీలకు, యాదాద్రి జిల్లాలో తొమ్మిది సొసైటీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తారని తెలిసింది. ఈ 31 సొసైటీలను గతంలో నిర్వహించిన ఆడిట్ ప్రకారం డిఫాల్టరుగా చేసినట్టు తెలిసింది. అయితే అధికారులు చూపించిన కారణాలను ఆ సొసైటీల పాలకవర్గాలు అంగీకరిస్తాయా? లేక కోర్టును ఆశ్రయిస్తాయా? అనేది తేలాల్సి ఉంది. జిల్లా సహకార అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు ఉండి ఆయా సొసైటీలను సముచిత కారణాలు లేకుండా డిఫాల్టర్ల జాబితాలో చేర్చితే సమస్య జటిలంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రాథమిక సహకార సంఘాలను రద్దు చేయాలంటే ప్రధానంగా సరైన కారణాలు చూపించాల్సి ఉంటుంది. ఆయా సొసైటీలు సహకార సూత్రాలకు అనుగుణంగా పనిచేయాల్సి ఉండటంతో పాటు, నష్టాలలో ఉంటే బాధ్యత వహించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఏదైనా సొసైటీలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకోవడంతో పాటు సభ్యుల సంఖ్య తగ్గితే అయితే ఆయా సొసైటీలపై చర్యలు తీసుకుంటారు. సహకార సెక్షన్లు 35తోపాటు 36 ప్రకారం డిఫాల్ట్ గా మారిన సొసైటీలను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. సంఘాలను రద్దు చేసిన విషయంలో కారణాలను స్పష్టంగా వెల్లడించాల్సి ఉంటుంది.

రాజకీయ రగడకు దారితీసే అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం అనూహ్యంగా సహకార సంఘాలపై తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయ రగడకు దారి తీసే అవకాశాలు

మిగతా 6వ పేజీలో...

వ్యసనాలకు బానిస కావొద్దు

జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.నాగరాజు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి నాగరాజు

నల్లగొండ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు బానిసకాకుండా సమాజంలో మంచి మనుషులుగా ఎదగాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.నాగరాజు అన్నారు. శనివారం నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఎలాంటి నేరాలకు, వ్యసనాలను లోను కాకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఒకసారి కేసు నమోదైతే భవిష్యత్లో ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగం రాదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థులకు మంచి లక్షణాలు ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ, కళాశాలలో ఇలాంటి న్యాయ అవగాహన సదస్సులు నెలకు ఒకటి నిర్వహించాలని కోరారు. జిల్లా అదనపు న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి కె.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చట్టానికి సంబంధించిన విషయాలు సాధారణంగా బోర్‌గానే ఉంటాయని, కానీ వాటితో పనిపడినప్పుడు అవి ఇష్టంగా మారుతాయన్నారు. ప్రతీ విద్యార్థికి చట్టాలపై కనీస అవగాహన ఉండాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడుతున్నప్పుడు హీరోలాగా ఫీల్ అవుతామని, కానీ ఆ తరువాత దాని ప్రభావం కనిపిస్తుందన్నారు. జీవితంలో దవాఖానాకు, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి వి.పురుషోత్తంరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి చత్రునాయక్, ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కె.అనంతరెడ్డి, కందుకూరి సుదర్శన్, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, అంతటి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్, సుధాకర్, అనిల్‌కుమార్, వెంకటరెడ్డి, మల్లేశం, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ నూరుశాతం పూర్తిచేయాలి

జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

నల్లగొండ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిపొందుతున్న వారి వివరాలు ఈకేవైసీ నూరుశాతం పూర్తిచేయాలని శిశు సంక్షేమశాఖ అధికారి కేవీ.కృష్ణవేణి అన్నారు. శనివారం ప్రాజెక్టు పరిధిలోని చర్లపల్లి సెక్టార్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈకేవైసీ ప్రకారంగానే నిధులు విడుదలవుతాయని అన్నారు. ఈ మేరకు లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం ఈకేవైసీ 96శాతం పూర్తయిందని, వెంటనే నూరుశాతం పూర్తిచేయాలన్నారు. అప్పుడే వచ్చే నెలకు సంబంధించిన ఇండెంట్ వస్తుందని తెలిపారు. ఆన్‌లైన్ పూర్తయినవారికి మాత్రమే పౌష్టికాహారం అందించే వీలుంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సమయానికి తెరవాలని, సిబ్బంది యూనిఫామ్ ధరించాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున అద్దె భవనాలు శిథిలావస్థలో ఉంటే వెంటనే వాటిని మార్చాలన్నారు. మరమ్మతులు చేయించాలన్నారు. సమావేశంలో కుర్షిదాబేగం, సుశీల, విజయ, రజిత, మంగ, సావిత్రమ్మ, పకృతాంబ, సునంద, పుష్పమ్మ, శంకరమ్మ, లావణ్య, లక్ష్మమ్మ, శిరీష, అనిత, తదితరులు పాల్గొన్నారు.

పేదల డాక్టర్ రాములునాయక్ మృతి



నేడు అంత్యక్రియలు

దేవరకొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండ్‌గా 22 ఏళ్లు పనిచేసి పేదల వైద్యుడిగా పేరొందిన డాక్టర్ రాములునాయక్ గుండెపోటుతో శనివారం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలియగానే పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు, వైద్యులు, రాజకీయ పార్టీల నాయకులు దేవరకొండలోని డాక్టర్ స్వగృహనికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

రాములునాయక్ దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి సూరింటెండెంట్‌గా 22 ఏళ్లు విధులు నిర్వహించారు. 2024లో కల్వకుర్తికి బదిలీ అయ్యారు. దేవరకొండలో సొంతంగా ఆస్పత్రిని ఏర్పాటు చేసి పేదలకు తక్కువ ఫీజుతో వైద్యాన్ని అందించారు. రాములునాయక్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె డాక్టర్ ప్రవళిక దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మరణ వార్త విని పలువురు పట్టణ ప్రజలు కంటతడి పెట్టారు. కాగా, రాములునాయక్ అంత్యక్రియలు ఆదివారం ఆయన వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

రాములునాయక్ మృతి తీరనిలోటు : ఎమ్మెల్యే బాలునాయక్

రాములునాయక్ మృతి పేద ప్రజలకు తీరని లోటని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. రాములునాయక్ మృతదేహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఎంతోమంది పేదలకు, రోగులకు రాములునాయక్ వైద్యాన్ని అందించారని గుర్తుచేశారు. అదేవిధంగా దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ నివాళులు అర్పించారు. రాములునాయక్ మృతిపై డీసీహెచ్ఎస్ డాక్టర్ మాతృనాయక్, డాక్టర్ రవిప్రకాష్, వేణుధర్‌రెడ్డి, కృష్ణ, మోతిలాల్, మంగ్తానాయక్, ఆలంపల్లి నర్సింహ, సిరాజ్‌ఖాన్, పల్లా నర్సింహరెడ్డి, బెజవాడ శేఖర్, వస్కుల సుధాకర్, గుండాల అంజయ్య యాదవ్, తదితరులు సంతాపం తెలిపారు.

నీటి విడుదల

సాగర్ 26 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

● మూసీకి వరద కొనసాగుతున్న వరద ఉధృతి 7

నల్లకొంగలతో బెంగ

● నాట్లు పిలక దశ వచ్చేవరకు తవ్వి తొక్కుతున్న కొంగలు

● తిరిగి నాట్లు వేసుకోవాల్సి వస్తుందని రైతుల ఆవేదన 6

విద్యుదాఘాతంతో ఆవు మృతి

నిడమనూరు, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారమ్మగూడెంలో శనివారం విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన వేముల స్వర్ణకుమార్‌రెడ్డికి చెందిన ఆవు గ్రామ శివారులో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు వేలాడుతున్న తీగలు తగిలి షాక్ కొట్టడంతో మృతి చెందింది. బాధితుడికి నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు కోరారు.

నేత్రదానం మహాదానం

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నేత్రదానం మహాదానమని వాసవీ క్లబ్ సభ్యుడు మిట్టపల్లి విజయభాస్కర్ అన్నారు. పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన మోదుగు ధనమ్మ(82) అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె కళ్లను కుటుంబ సభ్యుల అంగీకారంతో నేత్రనిధికి దానం చేశారు. కార్యక్రమంలో ధనమ్మ కుమారుడు మోదుగు వేణు, బచ్చలకూరి రమేష్, కిషోర్, వీటీ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి పత్యానాయక్

దామరచర్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి పత్యానాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, బొత్తలపాలెంలోని బాలికల హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను, ఆహార పదార్థాల స్టాక్‌ను, ఆహార నాణ్యతను పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలంలో దోమలు, ఈగలు విజృంభించకుండా పాఠశాలను ఎల్లప్పుడు పరి శు భ్రంగా ఉంచుకోవాలన్నారు. తరగతి గదుల్లో విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం బెట్టెతండా అంగన్‌వాడి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో బాలాజీ నాయక్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

అడుగుకో గుంత

● అధ్వానంగా గ్రామీణ రోడ్లు ● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

(ఆంధ్రజ్యోతి నిడమనూరు):
మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లపై పలుచోట్ల ఏర్పడిన గుంతలు వాహనదారులను, పాదచారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రహదారుల నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో కొద్ది రోజులకే దెబ్బతింటున్నాయి. వర్షాలు, వాహనాల రద్దీ కారణంగా రోడ్లు ధ్వంసం కావడమే కాకుండా అనేక చోట్ల అడుగుకో గుంత ఏర్పడింది. గ్రామాలకు వెళ్లే రోడ్లు బురదమయంగా మారాయి. ఈ రోడ్లతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లు దెబ్బతిన్నప్పటికీ సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. నిడమనూరు నుంచి బంకాపురం మీదుగా వెనిగండ్ల, సోమారిగూడెం, ఎర్రబెల్లి, కుంటిగొర్లగూడెం, గుంటుకగూడెం గ్రామాలకు వెళ్లే రోడ్లు ఎంతో అధ్వానంగా తయారయ్యాయి. వివిధ గ్రామాల్లో కల్వర్టులు కూడా దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల నడిచే పరిస్థితి కూడా లేదని పలువురు వాపోతున్నారు. అధికారుల స్పందించితక్షణమే మరమ్మతులు చేయించి, గుంతలు పూడ్చి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న సోమారిగూడెం రోడ్డు



అధ్వానంగా మారిన వెనిగండ్ల రోడ్డు

రోడ్లను మెరుగుపర్చాలి



గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్లన్నీ గుంతలమయం, బురదమయం కావడంతో వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. రోడ్లను సకాలంలో బాగు చేయడం లేదు. దెబ్బతిన్న గ్రామీణ రహదారులను మెరుగుపర్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సత్వరమే తగిన చర్యలు తీసుకోవాలి.
- నర్సింగు నాగార్జున, ఊట్కూరు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

భూ సమస్యలు పరిష్కరిస్తాం

● శ్రీనివాస్‌గౌడ్, తహసీల్దార్, డిండి



భూ సమస్యల పరిష్కారం కోసం కొన్ని నెలల క్రితం ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో 1,425 దరఖాస్తులు వచ్చినట్లు డిండి తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరలో రైతుల భూ సమస్యలు పరిష్కరించనున్నట్లు 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.
(ఆంధ్రజ్యోతి- డిండి)

ఆంధ్రజ్యోతి: రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలపై ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

తహసీల్దార్: రైతుల నుంచి మండలంలో 1,425 దరఖాస్తులు వచ్చాయి.

ఆంధ్రజ్యోతి: ఎలాంటి సమస్యలపై రైతులు దరఖాస్తులు చేసుకున్నారు?

తహసీల్దార్ : మిస్సింగ్ సర్వే నంబర్లు, భూ విస్తీర్ణం తగ్గడం, డిజిటల్ సం తకం లేకపోవడం, పెండింగ్ మ్యూటే షన్, భూస్వభావం, పట్టాదార్ వివరాల మార్పు వంటి సమస్యలపై దరఖాస్తులు అందాయి.

ఆంధ్రజ్యోతి: ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తుల సమస్యలు పరిష్కరించారు?

తహసీల్దార్: 200 దరఖాస్తుల సమస్యలు పరిష్కరించాం. రెవెన్యూ రికార్డుల ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ జరిపిన మీదట పరిష్కరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: శివాయి జమేదార్ అంటే ఏమిటి?

తహసీల్దార్: ఎలాంటి హక్కులు లేకుండా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న భూములను శివాయి జమేదార్ అంటారు. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా వీరికి హక్కులు కల్పించనున్నాం.

ఆంధ్రజ్యోతి: సాదాబైనామా, పీవోటీ ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, శివాయి జమేదార్‌కు సంబంధించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

తహసీల్దార్: 550 దరఖాస్తులు వచ్చాయి.

ఆంధ్రజ్యోతి: సాదాబైనామాల పరిస్థితి ఏమిటి ?

తహసీల్దార్: ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడగానే సాదాబైనామాలు పరిష్కరిస్తాం. ఇప్పటికే నోటీసులు జారీ చేశాం.

ఓటర్ జాబితా పారదర్శకంగా రూపొందించాలి

● సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

వేములపల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఓటర్ జాబితాను పారదర్శకంగా రూపొందించాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ ముసాయిదా ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముసాయిదా జాబితా అభ్యంతరాలను పరిశీలించి వాటిని సాధ్యమైనంతవరకు పరిష్కరించి సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తామన్నారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలు గ్రామంలోని ఓట్లను అన్ని వార్డులకు సమానంగా వర్గీకరించాలని, ఒక కుటుంబంలోని ఓటర్లందరు ఒకే వార్డులో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, చిర్ర మల్లయ్యయాదవ్, రెమడాల పరుశురాములు, కట్టా మల్లేష్ గౌడ్, జడ రాములుయాదవ్, జిల్లా యాదగిరి, పెదమాం భరత్, వడ్డెగాని సైదులు, పుట్టల వెంకటేశ్వర్లు, దైద ప్రేమ్, బొంగర్ల వినోద్, దైద జాన్సన్, పుట్టల శ్రీనివాస్ పాల్గొన్నారు.

● నేరేడుగొమ్ము : ఓటరు లిస్టులో తప్పులు దొర్లకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య కోరారు. శనివారం నేరేడుగొమ్ము మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో పోలింగ్ కేంద్రాలు, ఓట్ల నమోదుపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓటరు జాబితాలో తప్పు, ఒప్పులను సరిచేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసమావేశంలో ఎంపీడీవో వాణి, తహసీల్దార్ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు.



వేములపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్

● చింతపల్లి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో డీఎల్పీవో శంకర్‌నాయక్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఎన్నికలపై వార్డువారీగా ముసాయిదా పోలింగ్ స్టేషన్ల నిర్వహణపై రాజకీయ నాయకులతో చర్చించినట్లు ఆయన తెలిపారు. ఓటర్ జాబితాలో సాంకేతిక లోపం కారణంగా లేని వారి పేర్లు నమోదు చేస్తే వాటిని సవరణ చేసి గ్రామాల్లో నివాసం ఉంటున్న ఓటర్లను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, ఎంపీవో ప్రవీణ్, శ్రీధర్, అంగిరేకుల నాగభూషణ్, నగేష్, రవి, రాములు, పోలే వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి : ఓటరు జాబితాపై మండలానికి చెందిన వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఓటర్లకు సంబంధించిన వివవరాలపై రాజకీయ నాయకులతో చర్చించి ఏమైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో సంగీత అన్నారు. వివిధ గ్రామపంచాయతీలకు సంబంధించిన నాయకులు ఎంపీడీవోకు ఓటరు జాబితాపై ఫిర్యాదులు అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, నర్సింహ, రాజు, చింతకాయల సతీష్, శ్రీశైలం, బొమ్మకంటి నర్సింహపాల్గొన్నారు.

●పెద్దవూర : గ్రామపంచాయతీల్లో ప్రదర్శించిన ఓటరు జాబితాలో ఏమైనా సవరణలు ఉంటే సూచించాలని కోరుతూ పెద్దవూర ఎంపీడీవో కార్యాలయంలో అఖిలపక్ష సమావేశాన్ని ఎంపీడీవో ఉమాదేవి నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రయ్య, భిక్షంరెడ్డి, ఆర్.రాములు, శ్రీనివాసులు, మట్టారెడ్డి, జటావత్ రవినాయక్, కిలారి మురళీ, ఎంఎస్పీ ముత్యాలు, నరసింహ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధం కండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు షైనం కిషన్‌రావు 35వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కిషన్‌రావు హత్య గావించబడి 35 ఏళ్లు అయిందని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, చౌగాని సీతారాములు, గౌతంరెడ్డి, చౌగాని వెంకన్న, నాగయ్య సైదమ్మ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు



ఎంపీడీవో దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కొండమల్లేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. కొండమల్లేపల్లి ఎంపీడీవో బాలరాజురెడ్డి ఉద్యోగ విరమణ సన్మానోత్సవం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఎంపీడీవో బాలరాజురెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, డీఆర్డీవో పీడీ శేఖర్‌రెడ్డి, ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఛైర్మన్ సలహాదారుడు గన్నారెడ్డి, మాజీ ఎంపిపి రేఖా శ్రీధర్‌రెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

కొండమల్లేపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ జాబ్ కార్డులు ఇచ్చి పనులు కల్పించి వలసలను నివారించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ కోరారు. మండలంలోని కొల్‌ముంతలపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపూజీ నగర్ గ్రామంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై అధ్యయనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రషర్ స్టోన్‌తో ఉపాధి లేకుండాపోయిందని, ఉపాధి దొరక్క ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వలసలను నివారించేందుకు ఉపాధి పనులు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో కావలి కృష్ణయ్య, గ్రామ కూలీలు యాదమ్మ, సుగుణమ్మ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవకు అభినందన

మిర్యాలగూడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మూఢనమ్మకాల నిర్మూలన కృషి చేస్తున్నందుకు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి కందుకూరి సుదర్శన్‌ను అభినందిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి నాగరాజు మెమోంటోను అందజేశారు. న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ నాగార్జున డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'చట్టాలపై అవగాహన' కార్యక్రమంలో మూఢనమ్మకాలపై, ఎయిడ్స్, డ్రగ్స్ నిర్మూలన, బాలకార్మికులపై సామాజిక గీతాలు ఆలపించినందుకు ఫ్యామిలీ కోర్టు జడ్జి దుర్గాప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, నర్సింగ్ కోటయ్య చేతుల మీదుగా మెమొంటో అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొండల్‌రెడ్డి, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.



మెమొంటో అందజేస్తున్న న్యాయమూర్తి నాగరాజు



వీధి కుక్కలతో అప్రమత్తంగా ఉండాలి

హాలియా, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హాలియా మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి అన్నారు. స్థానిక మహాత్మా జ్యోతి బాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో వీధి కుక్కల నియంత్రణ, రేబిస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంపులుగా తిరిగే కుక్కలు ప్రమాదకరమై ఉండే అవకాశం ఉన్నందున ఒంటరిగా వెళ్లకూడదన్నారు. ఇంట్లో పెంచే కుక్కలను నిర్లక్ష్యంగా బయటకు వదిలిపెట్టకుండా యజమాని పర్యవేక్షణలోనే బయటకు తీసుకెళ్లాలని తెలిపారు. రెబిస్ వ్యాధి ప్రాణాంతకమని, వీధికుక్కల నుంచి ఈవ్యాధి వ్యాప్తి చెందే అవకాశాలు అధికంగా ఉంటాయని, కుక్క కాటు వేస్తే 24 గంటల లోపు తప్పనిసరిగా రేబిస్ ఇంజెక్షన్ వేయించుకోవాలని సూచించారు. పట్టణంలో శునకాల నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేసేందుకు మున్సిపాలిటీ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుటుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు రేబిస్ నివారణ చర్యలు, శునకాల నియంత్రణ పద్ధతులు, పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లలిత, మునిసిపల్ పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, బిల్ కలెక్టర్ శ్రీశైలం, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి

1న పెన్షన్ విద్రోహదినంగా పాటించాలి : యూటీఎఫ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

నిడమనూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 1న ఉద్యోగులు పెన్షన్ విద్రోహదినంగా పాటించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమరాజు సైదులు అన్నారు. మండల కేంద్రంలో శనివారం టీజీఈ జేఏసీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీజీఈ జేఏసీ మూడు దశల ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా పెన్షన్ విద్రోహదినం నిర్వహించడంతో పాటు జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమాల్లో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కృష్ణవేణి, ఎంఈవో లాహూరి వెంకన్న, మండల పరిషత్ సూపరింటెండెంట్ బోనగిరి రమేష్, కాంప్లెక్స్ హెచ్ఎం గౌతమ్, రాధాకృష్ణ, యూటీఎఫ్ నాయకులు లింగంపల్లి అంజయ్య, బొమ్ము ఉపేందర్, పంచాయతీ కార్యదర్శులు గంగుల లింగయ్య, సత్యనారాయణ, నర్సింహాచారి, సైదులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి వెళ్లను!

(5వ పేజీ తరువాయి)

మండలంలో జరిగిన కార్యక్రమంలో పదవులే కాదు పైసలు కూడా ఇవ్వడం లేదని వాపోయారు. తమ నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణాలకు నిధులివ్వడం లేదని, దీంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతోందని వివరించారు. తాజాగా, శుక్రవారం చౌటుప్పల్‌లో తన క్యాంపు కార్యాలయం వద్ద అక్కడకు వచ్చిన ట్రిపుల్‌ఆర్ నిర్వాసితుల సమస్యలు విని ఆర్డీవోకు ఫోన్ చేసి భూసేకరణపై తాను సీఎంతో మాట్లాడతానని, రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని, నోటీసులిచ్చే ప్రక్రియను కొంతకాలం నిలపాలని సూచించారు. తాజాగా, శనివారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మరోసారి హైదరాబాద్ కేంద్రంగా ఈ సమావేశాల్లో తాను అసెంబ్లీకి వెళ్లేది లేదని, వరద సహాయక చర్యల్లో పాల్గొంటానని ప్రకటించారు. మొత్తంగా కాంగ్రెస్ అధిష్ఠానంపై రాజగోపాల్‌రెడ్డిలో నెలకొన్న అసంతృప్తి, అసహనం ఎటువైపు దారి తీస్తుందోననే ఆసక్తి రాజకీయవర్గాల్లో నెలకొంది. నియోజకవర్గంలో ఆయన ప్రత్యర్థులు సైతం రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపై ప్రేమతప్ప నియోజకవర్గ అభివృద్ధి గురించి ధ్యాస లేదంటూ వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారు. దీంతో రాజగోపాల్‌రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోననే ఆసక్తి చర్చ సాగుతోంది.

విఘ్నేశ్వరుడికి విశేష పూజలు

మిర్యాలగూడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయక మండపాల వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ 6వ వార్డులో మాజీ కౌన్సిలర్ సాధినేని స్రవంతీశ్రీనివాసరావు నెలకొల్పిన వినాయక మండపం వద్ద మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, మట్టపల్లి సైదయ్య యాదవ్, అయిల వెంకన్న, వింజం శ్రీధర్, పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, రవీందర్ నాయక్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, విజయసింహారెడ్డి

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని ఎంఈవో వెంకటయ్య అన్నారు. మండలంలోని బాలాజీనగర్ ఎంపీపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత బ్యాగులు, నోట్ బుక్స్ ఇతర స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. దీనికి ముఖ్య అతిథిగా ఎంఈవో హాజరై మాట్లాడారు. గ్రామీణ పేద విద్యార్థులకు యూత్ ఫర్‌సేవా స్వచ్ఛంద సంస్థ చేయూతనివ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. దాతల చేయూతను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి ఉన్నతిని సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మూనా, ఉపాధ్యాయులు సతీష్, జైశంకర్, రవి, యుగేందర్,యూత్ ఫర్ సేవా వలంటీర్ మెగావత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

శిశుమందిర్ అభివృద్ధికి సహకరించాలి



నిత్యావసర సరుకులు అందిస్తున్న దాతలు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ శిశుమందిర్ అభివృద్ధికి దాతలు సహకరించాలని ఆర్ఎస్ఎస్ నగర కార్యవాహ సుధాకర్ అన్నారు. హనుమాన్‌పేటకు చెందిన జూలూరు ఉమాశంకర్-స్వాతి దంపతుల ఆధ్వర్యంలో హౌసింగ్‌బోర్డులోని శిశుమందిర్‌కు నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చిలుకూరు రామశ్యాం, చెరుపల్లి కరుణాకర్, తలకోన శ్రీనివాస్, చెన్న శ్రీను, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, శివ, గణేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై స్పష్టతనివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సైదులుగౌడ్

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై స్పష్టతనిచ్చిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటూ మాయమాటలు చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో శ్రద్ధ చూపలేదన్నారు. బీసీలకు స్థానిక సంస్థలే పట్టుకొమ్మలని, రాజ్యాధికారం సాధించాలంటే స్థానిక ఎన్నికలలో బీసీలకు సముచిత స్థానాలు కల్పించాల్సిన అవసరముందన్నారు. అయితే 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ఎలాంటి స్పష్టత ఇవ్వకుండానే ఎన్నికలకు వెళ్లడం సరికాదని, బీసీలను మోసగిస్తే, ఆయా పార్టీలకు రానున్న ఎన్నికలలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర సంయుక్తకార్యదర్శి శిరసనవాడ నర్సింహ, పెగిరేటి వెంకటాచారి, కర్నాటి శివరామకృష్ణ, వెంకటి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.